ఊహించిందే జరిగింది!

సార్వత్రిక ఎన్నికల్లో శాంతిభద్రతలను నియంత్రించడంలో పోలీసు యంత్రాంగం విఫలం కావడంతో అంతా ఊహించినట్టుగానే జరిగిపోయింది. ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌పై బదిలీ వేటు వేసిన ఎన్నికల కమిషన్.. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి, స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్, అలిపిరి సీఐ రామచంద్రారెడ్డిని సస్పెండు చేసింది. ఎస్పీ సహా వీరందరిపై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. దీనికి తోడు ఈసీ నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం జిల్లాలో కూడా హింసాత్మక ఘటనల పూర్వాపరాలను, వాటిని అడ్డుకోవడంలో, అనంతర చర్యల్లో ఎస్పీ సహా కింది స్థాయి అధికారులు వ్యవహరించిన తీరును లోతుగా విచారించి ఈసీకి నివేదిక ఇవ్వనుంది. ఎన్నికల నిర్వహణను ఆషామాషీగా తీసుకున్న అధికారులు దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- జిల్లా ఎస్పీ బదిలీ
- తిరుపతి డీఎస్పీ, ఎస్బీ డీఎస్పీ సస్పెన్షన్
- స్పెషల్ బ్రాంచి సీఐ, అలిపిరి సీఐ కూడా..
- ఐదుగురిపైనా శాఖాపరమైన విచారణ
- ఎన్నికల కమిషన్ సంచలనాత్మక చర్యలు
- చంద్రగిరి నియోజకవర్గంలో 'పోలింగ్'.. అనంతర హింసాత్మక ఘటనలపై ఆగ్రహం



ఎస్పీ కృష్ణకాంత్ పటేల్

స్పెషల్ బ్రాంచి డీఎస్పీ భాస్కర్‌రెడ్డి

తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి

స్పెషల్ బ్రాంచి సీఐ రాజశేఖర్

అలిపిరి సీఐ రామచంద్రారెడ్డి

పోలింగ్ రోజు ఐదు చోట్ల ఉద్రిక్తత

ఈనెల 13న పోలింగ్ సందర్భంగా రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాల్వ పోలింగ్ కేంద్రంలో వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ ఘర్షణ జరిగింది. బీఎస్ఎఫ్ జవాన్ గాల్లోకి కాల్పులు జరిపినా పరిస్థితి అదుపులోకి రాలేదు. వైసీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డి భారీగా అనుచరులను వెంటదీసుకుని టీడీపీ కంచుకోట వంటి ఆ గ్రామంలోకి వచ్చి తమ ఏజంట్లపై దాడి చేసింది ఎవరంటూ టీడీపీ ఏజంట్లపై దౌర్జన్యానికి యత్నించారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత తలెత్తింది. అదే రోజు నానీ స్వగ్రామమైన పాకాల మండలం పులివర్తివారిపల్లికి వెళ్లిన వైసీపీ అభ్యర్థిని గ్రామస్తులు అడ్డుకోగా ఉద్రిక్తత నెలకొంది. ఆయన్ను నిర్బంధించారన్న ప్రచారంతో తుమ్మలగుంటలో గ్రామస్తులు పోలింగ్ కేంద్రాన్ని చుట్టుముట్టి మోహిత్ క్షేమంగా వచ్చేవరకూ ఈవీఎంలను తరలించడానికి వీల్లేదని అడ్డుపడ్డారు. అక్కడ టీడీపీ నేత దొడ్ల కరుణాకర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. అదే రోజు రాత్రి చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కూచువారిపల్లి గ్రామాల్లో వైసీపీ, టీడీపీ వర్గీయులు దాడులు, ప్రతిదాడులకు పాల్పడ్డారు. ఆ గ్రామాలకు మోహిత్ అనుచరులతో వెళ్లడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. వైసీపీ సర్పంచ్ ఇల్లు, రెండు కార్లను టీడీపీ వర్గీయులు తగులబెట్టారు.





పోలింగ్ రోజున బ్రాహ్మణ కాల్వ పోలింగ్ కేంద్రంలో ఘర్షణ



ఈనెల 13న కూచువారిపల్లిలో చెవిరెడ్డి మోహిత్, పులివర్తి వినీల్ మధ్య వాగ్వాదం

నామినేషన్ల నాడే తొలి ప్రమాద ఘంటికలు

చంద్రగిరి వైసీపీ, టీడీపీ అభ్యర్థులను గత నెల 25వ తేదీన ఒకే సమయంలో నామినేషన్లకు అనుమతించినప్పుడే అధికారుల అవగాహనా రాహిత్యం బట్టబయలైంది. టీడీపీ అభ్యర్థి కోసం భారీ ఎత్తున తరలివచ్చిన శ్రేణులను పోలీసులు నియంత్రించలేకపోయారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రం వద్ద ఇరువర్గాలూ రాళ్ల దాడికి దిగడంతో పాటు ఎమ్మెల్యే చెవిరెడ్డి వాహనంపై రాళ్లు, కర్రలతో దాడి జరిగింది. లాఠీఛార్జి చేసి పరిస్థితిని అదుపు చేయాల్సి వచ్చింది. వాస్తవానికి అప్పుడే అధికారులు అప్రమత్తమై చంద్రగిరి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించివుండాల్సింది. కానీ అలా జరగలేదు.

నానీపై దాడి ఘటనలో బట్టబయలైన పోలీసు వైఫల్యం

పోలింగ్ మరునాడు టీడీపీ అభ్యర్థి నానీపై జరిగిన దాడి ఘటనలో పోలీసు వైఫల్యం బయటపడింది. నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తనకు, తన కుటుంబానికి తగిన రక్షణ లేదని ఆయన హైకోర్టును ఆశ్రయించి గన్‌మెన్ భద్రత పొందారు. అలా పొందిన కొద్ది రోజులకే ఆయనపై ఏకంగా హత్యాయత్నం జరిగింది. ప్రధాన ప్రతిపక్ష నేతకు తగిన భద్రత కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమైంది. తర్వాత కూడా అక్కడ పరిస్థితులను అదుపు చేయడంలో పోలీసు యంత్రాంగం చేతులెత్తేసింది. వర్సిటీ ప్రాంగణంలో జరిగిన ఈ దాడి ఈవీఎంలు వుంచిన స్ట్రాంగ్ రూముల భద్రతను కూడా ప్రశ్నార్థకం చేసింది.

డక్కిలి, చిల్లకూరు మండలాల్లోనూ హింసాత్మక ఘటనలు

- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వరరెడ్డికి తిక్కగుంటపాలెంలో రొయ్యల చెరువులు ఉన్నాయి. పోలింగ్‌కు ముందు రోజైన ఆదివారం రాత్రి రొయ్యల చెరువుల్లో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలిపారు. దీంతో రూ. 15 లక్షలు విలువైన రొయ్యలు చనిపోయి నీటిపైకి తేలాయి. ఈ ఘటనపై బాధితులు పోలీసులు పిర్యాదు చేశాడు.
- వెంకటగిరి నియోజకవర్గం డక్కిలి మండలం అల్తూరుపాడులో పోలింగ్ రోజు ఓ కానిస్టేబుల్ వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు దాడి చేసి కొట్టారు. ● గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన టీడీపీ నేత గోపాల్ పోలింగ్ రోజు టీడీపీకి అనుకూలంగా పనిచేశారని ఆరోపిస్తూ మరుసటి రోజైన మంగళవారం వైసీపీ వర్గీయులు ఇనుప రాడ్లతో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచారు.
- చిల్లకూరు 114, 117 బూత్‌లలో పోలింగ్ రోజు టీడీపీ నేత కొండా రామచంద్రారెడ్డిపై వైసీపీ నేత నరేంద్ర రెడ్డి దాడి చేసి కొట్టారు. బాధితునికి రక్షణ కల్పించాల్సిన చిల్లకూరు ఎస్ఐ అంజిరెడ్డి దానికి భిన్నంగా బాధితుడినే లాఠీతో చితకబాదారు. తోపులాట, ఘర్షణతో టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్‌తో పాటు టీడీపీ దళిత మహిళా నేత విజయ కూడా గాయపడ్డారు.

కలెక్టర్ లక్ష్మీశా బదిలీతో అప్రమత్తం కాని యంత్రాంగం

ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లకు మించి విధులు నిర్వర్తిస్తున్న అధికారుల బదిలీల్లో భాగంగా కలెక్టర్ వెంకట్రమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ లక్ష్మీశా గత డిసెంబరులో కలెక్టర్‌గా వచ్చారు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిని ఇంటికి వెళ్లి మరీ కలసి శాలువా కప్పి సత్కరించడంతో ప్రతిపక్షాల నమ్మకాన్ని కోల్పోయారు. ప్రతిపక్ష పార్టీల నేతల ఫిర్యాదుతో ఈసీ ఆయన్ను గత నెల 2వ తేదీన బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్‌ను కలెక్టర్‌గా నియమించింది. ఈసీ తీరు ఎలా వుందో ఈ ఘటన స్పష్టంగా వెల్లడించినా జిల్లాలో అధికారులు మాత్రం అప్రమత్తం కాలేదు.

మరోసారి గంగలో కలసిన జిల్లా పరువూ ప్రతిష్ఠ

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘోరంగా విఫలమైన నాటి కలెక్టర్ భరత్ నారాయణ గుప్తా, తిరుపతి అర్బన్ ఎస్పీ ఆవుల రమేష్‌రెడ్డిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో పలమనేరు డీఎస్పీ, శ్రీకాళహస్తి, పుంగనూరు సీఐలపైనా బదిలీ వేటు పడింది. తర్వాత తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఘటనలతో అప్పటి తిరుపతి మున్సిపల్ కమిషనర్ గిరీశా, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ఇద్దరు సీఐలు, ఓ ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, తిరుపతి అర్బన్ తహసీల్దారు, డిప్యూటీ తహసిల్దారు సస్పెన్షన్‌కు గురయ్యారు. తాజా ఎన్నికల్లో తిరుపతి కలెక్టర్ లక్ష్మీశా కూడా బదిలీ వేటుకు గురయ్యారు. ఈ ఘటనలతో ఇప్పటికే దారుణంగా దెబ్బతిన్న జిల్లా పరువు ప్రతిష్ఠలు తాజాగా ఈసీ ఆదేశాలతో మరింతగా గంగ పాలయ్యాయి.

అనుభవలేమితో ఎస్పీ తప్పటడుగు!

శాంతి భద్రతల నిర్వహణ, ఎన్నికల నిర్వహణల్లో తగిన అనుభవం, అవగాహన లేకపోవడంతోనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తప్పటడుగు వేసినట్టు తెలుస్తోంది. 2018 బ్యాచ్ ఐపీఎస్ అధికారైన ఈయన రంపచోడవరంలో అసిస్టెంట్ ఎస్పీగా, కర్నూలు జిల్లాలో సెబ్ ఏఎస్పీగా, విజయవాడలో లా అండ్ ఆర్డర్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు. ఎస్పీగా తిరుపతిలోనే తొలి పోస్టింగ్. సరిగ్గా ఎన్నికల సమయంలో ఎస్పీగా విధులు చేపట్టడంతో తగిన అనుభవం, అవగాహన లేక కింది స్థాయి అధికారులపై ఆధారపడటం ఆయనకు చేటు చేసింది. అనుభవం, సమర్థత కలిగిన తదుపరి స్థాయి అధికారులు వున్నప్పటికీ వారిని పక్కనపెట్టి వారి కంటే కింది స్థాయిలో వున్న కొందరు అధికారులపై ఆధారపడ్డారని, అధికార పార్టీ నేతలతో అంటకాగుతున్న వారి సలహాలు, సూచనలతోనే విధి నిర్వహణలో విఫలమయ్యారన్న ప్రచారం జరుగుతోంది. 2014 ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో ఘర్షణలు జరగడం, 2019లో ఏడు చోట్ల రీ పోలింగ్ జరగడం వంటి గత చరిత్రను ఎస్పీ పూర్తిగా విస్మరించినట్టు కనిపిస్తోంది. దీనికి తోడు తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నాటి ఘర్షణలు, 2021 తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఉదంతాలూ పరిగణనలోకి తీసుకున్నట్టు లేదు. జిల్లాకు ఎస్పీగా వచ్చినపుడు ఇక్కడి గత చరిత్రను తెలుసుకుని దానికనుగుణంగా జాగ్రత్తలు తీసుకుని వుంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

తిరుపతి ఎమ్మెల్యే బహిరంగంగా బెదిరించినా..

తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పోలింగ్‌కు రెండు రోజులు ముందు జీవకోనలో ఎన్నికల ప్రచారంలో బహిరంగంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధులను బెదిరించారు. మళ్లీ అధికారంలోకి వస్తే అంతు చూస్తామని హెచ్చరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఇదిఉల్లంఘించడమే అయినా పోలీసులు స్పందించలేదు. జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బెదిరింపులు మళ్లీ కొనసాగుతుండడంతో మరోసారి ఎస్పీ దృష్టికి తెచ్చేందుకు సం ఘాలు యత్నించినా కనీసం కలిసేందుకు కూడా ఆయన అవకాశం ఇవ్వలేదు.

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

- శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు



తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వేసవి సెలవులు మొదలై చాలా రోజులైనప్పటికీ ఎన్నికల కారణంగా కొండపై రద్దీ తక్కువగానే కనిపించింది. వారాంతాల్లో మినహా మిగిలిన రోజుల్లో చాలా సాధారణంగా ఉంది. రాజకీయ నాయకులు కూడా ఎన్నికల ప్రచారంలో నిమగ్నం కావడంతో వీఐపీ బ్రేక్‌లో కూడా వీఐపీలు తక్కువగా కనిపించారు. ఈనెల 13వ తేదీతో పోలింగ్ ప్రక్రియ పూర్తవడంతో ఇటు సాధారణ భక్తులు, అటు వీఐపీలు తరలివస్తున్నారు. దీంతో గురువారం సాయంత్రం నుంచి రద్దీ భారీగా పెరిగింది. శ్రీవారి ఆలయం, మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద భవనం, లడ్డూకౌంటర్ వంటి ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. రద్దీ పెరిగిన నేపథ్యంలో గదుల కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరుతున్నారు. కల్యాణ కట్టల్లోనూ రద్దీ అధికంగా ఉంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి ఉద్యానవనంలో షెడ్లు నిండిపోవడంతో సర్వదర్శన భక్తులకు 24 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ మైకుల ద్వారా ప్రచారం చేస్తోంది.

ప్రదక్షిణ చేయనీయకుండా గేట్లు?

రద్దీ పెరిగిన క్రమంలో చాలా మంది భక్తులు కనీసం ఆలయ నాలుగు మాడవీధుల్లో ప్రదక్షిణ చేసి, అఖిలాండం వద్ద కొబ్బరికాయాలు కొట్టి వెళ్లిపోతుంటారు. అయితే రద్దీ పెరిగిందనే పేరుతో దక్షిణ మాడవీధిలోని మూవింగ్ బ్రిడ్జి వద్ద ఉన్న గేటును మూసివేసి భక్తులకు ప్రదక్షిణ చేసే అవకాశం కూడా లేకుండా చేశారు. దాంతో ఇటు స్వామి దర్శనం లభించక, అటు గుడి చుట్టూ ప్రదక్షిణ కూడా చేసే అవకాశం లేకపోవడంతో చాలా మంది భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా మూవింగ్ బ్రిడ్జి సమీపానికి చేరుకునేవారితో అక్కడున్న భద్రతా సిబ్బంది దురుసుగా ప్రవర్తించారంటూ పలువురు భక్తులు అసహనం వ్యక్తం చేశారు.



దక్షిణ మాడవీధిలో భక్తులు ప్రదక్షిణ చేయడానికి వీల్లేకుండా పెట్టిన గేట్

పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో 13 మంది అరెస్టు

- కడప సెంట్రల్ జైలుకు నిందితుల తరలింపు

తిరుపతి(నేరవిభాగం), మే 16: చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో మొత్తం 13మందిని అరెస్టు చేశారు. నిందితులను కడప సెంట్రల్ జైలుకు తరలించారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ని మంగళవారం సాయంత్రం పరిశీలించి వస్తున్న నాని, అతని గన్‌మేన్ ధరణిపై వైసీపీ శ్రేణులు సమ్మెటలు, రాడ్లు, రాళ్లు, కర్రలు, బీరు బాటిళ్లతో దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో నాని చేతికి బలమైన గాయమవగా, గన్‌మేన్ కంటిపై తీవ్ర రక్తగాయమైంది. ఈ ఘటనపై ఎస్వీయూనివర్సిటీ పోలీసులకు, ఎన్నికల కమిషన్‌కూ నానీ ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లడంతో వర్సిటీ సీఐ మురళీమోహన్‌రావు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, గాలింపు చర్యలు వేగవంతం చేశారు. సంఘటన జరిగిన రోజునే ఏడుగురిని రోజు అదుపులోకి తీసుకోగా, మిగిలిన ఆరుగురిని బుధవారం రాత్రి పట్టుకుని విచారించారు. గురువారం వీరిని అరెస్టు చూపారు. నిందితులపై హత్యాయత్నానికి పాల్పడినట్టు కేసు నమోదు చేశారు. కాగా, 13 మంది నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తిరుపతి డీఎస్పీ సురేంద్ర రెడ్డి, సీసీఎస్ డీఎస్పీ రవికుమార్, ఎస్వీయూ సీఐ మురళీమోహన్‌రావు, ఎస్ఐ రామాంజనేయులు, అంజనప్ప, ఐడీ పార్టీ సిబ్బంది ఏఎస్ఐ దామోదర్, మోహన్‌బాబు, ఈశ్వర్, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ అభినందించి, రివార్డులు ప్రకటించారు.

నిందితుల వివరాలిలా..

ప్రధాన నిందితుల్లో రామచంద్రాపురం మండలం దిగువ రామాపురానికి చెందిన జడ్పీటీసీ భర్త వల్లేటి భానుకుమార్ రెడ్డి, నడవలూరు సర్పంచ్ గణపతి రెడ్డి ఉండగా, మిగిలిన వారిలో.. దిగువ రామాపురానికి చెందిన ముదిపల్లి జానకిరెడ్డి, జానయ్యగారి జయచంద్రా రెడ్డి, పొదలకూరు కోదండమ్, బొక్కిసం చిరంజీవి, దండు పుష్పకాంత్ రెడ్డి, అదే మండలం గడ్డక్రింద పల్లికి చెందిన ఎద్దల భాస్కరరెడ్డి, కామసాని సాంబశివా రెడ్డి, తిరుమల బాలాజీ నగర్‌కు చెందిన అప్పన్నగారి సుధాకరరెడ్డి, తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లిలో కాపురమున్న పి.హరికృష్ణ, తిరుమల బాలాజీనగర్‌కు చెందిన పసుపులేటి రాము, రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన గోగుల కోటయ్య ఉన్నారు.

మృత్యుఒడికి ముగ్గురు అక్కా చెల్లెళ్లు

- దీపాలు వదులుతూ చెరువులో జారిపడి మృతి



గూళూరు చెరువు

విలపిస్తున్న తల్లి విజయ



రూపిక, చరిత, యాషిక మృతదేహాలు

వడమాలపేట, మే 16: దీపాలు చెరువులో వదులుతుండగా ప్రమాదవశాత్తూ ముగ్గురు అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడ్డారు. వివరాలివి. వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామానికి చెందిన బాబు, విజయ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. రూపిక(10) 5వ తరగతి, చరిత(13) 9వ తరగతి, యాషిక(ఇంటర్మీడియట్) చదువుతున్నారు. బాబు గ్రామంలో ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేస్తారు. గురువారం అతను మహాశివుని దర్శనార్థం తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లారు. భార్య విజయ తన కుమార్తెలతో దిగువ గూళూరు వద్ద శివాలయంలో పూజ చేయడానికి వెళ్లింది. ఆమె పూజ చేస్తుండగా.. గూళూరు చెరువులో దీపాలు వదలడానికి ముగ్గురు అక్కాచెల్లెళ్లు వెళ్లారు. మెట్ల మీద కూర్చొని దీపాలు వదులుతుండగా రూపిక జారి పడింది. వెంటనే కాపాడడానికి ప్రయత్నిస్తూ ఇద్దరు అక్కాచెల్లెళ్లు చెరువులో దూకారు. వీరి అరుపులు, కేకలు విని సమీపంలోని స్థానికులు వెళ్లారు. కానీ అప్పటికే ముగ్గురూ చెరువులో మునిగి చనిపోయారు. తల్లి విజయ చెరువు దగ్గర కన్నీరుమున్నీరైంది. ముగ్గురి మృతదేహాలను గ్రామస్తులు బయటకు తీశారు. మృతదేహాలను పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు.

శోకసంద్రంలో ఎస్‌బీఆర్ పురం

అక్కాచెల్లెళ్ల మృతి సంఘటనతో ఎస్‌బీఆర్ పురం గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. పుత్తూరు ప్రభుత్వాస్పత్రి పరిసరాలు కుటుంబీకులు, బంధువుల రోదనలతో నిండిపోయాయి. ముగ్గురు కుమార్తెలనూ కోల్పోయిన తల్లి విజయను ఓదార్చడం ఎవరి తరమూకాలేదు. పెద్దకుమార్తె యాషిక ఇంటర్‌లో 990 మార్కులు సాధించింది. అప్పు చేసి.. తిరుపతిలోని ప్రైవేటు కళాశాలలో చదివించారని స్థానికులు చెబుతున్నారు.



ఓటమి భయంతోనే వైసీపీ దాడులు

రఘురామకృష్ణరాజు

రేణిగుంట, మే 16: ఓటమి భయంతోనే కూటమి నాయకులపై వైసీపీ దాడులకు పాల్పడుతోందని పశ్చిమగోదావరి జిల్లా ఉండి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి రఘురామకృష్ణరాజు విమర్శించారు. గురువారం తిరుపతి విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్, సజ్జల మాటల్లో ధ్వనిస్తున్న వణుకు వారి ఆందోళనను చాటుతోందన్నారు. వారి ముఖ కవళికలు చూస్తే స్పష్టంగా ఓటమి అర్థమవుతోందన్నారు. రాష్ట్రంలో ఈ 15రోజులూ కేడర్‌లో జోష్‌ను నింపేందుకు 150 స్థానాలు స్థానాలు గెలుస్తున్నామని వైసీపీ నేతలు చెబుతూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిసున్నారన్నారు. కూటమి 1994లో కన్నా 130, 135 స్థానాలు విజయం సాధిస్తుందన్నారు. 150 స్థానాలు సాధించినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం ఆయన చంద్రగిరి కూటమి అభ్యర్థి పులివర్తి నానిని పరామర్శించేందుకు వెళ్లారు.

కారు దగ్ధం



తిరుపతి(నేరవిభాగం), మే 16: ఓ కారు దగ్ధమైన సంఘటన తిరుపతి గరుడ సర్కిల్‌లో జరిగింది. నంద్యాల జిల్లా బనగానపల్లెకి చెందిన ఎం.శ్రీనివాస రెడ్డి కుటుంబీకులతో తిరుమలకు వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం కారులో గురువారం తిరుపతికొచ్చారు. అనంతరం మోహన్ బాబు కాలేజీ వద్దకెళ్లి అక్కడ తెలిసిన వారితో మాట్లాడి జూ పార్కు రోడ్డులో తిరుపతికి బయల్దేరారు. అలిపిరి గరుడ సర్కిల్ సమీపానికి వచ్చేసరికి కారు ఇంజిన్ వేడెక్కి, ఉన్నట్టుండి బ్యాటరీల నుంచి మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై వాహనంలోని వారిని దింపేయడంతో పెను ప్రమాదం తప్పింది. తాము వెళ్లేసరికే కారు చాలా వరకు దగ్ధమవగా, రూ.3లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

తాగునీటి కోసం వచ్చి బావిలో పడిన దుప్పి

బయటకు తీసి అడవిలో వదిలిన అటవీ సిబ్బంది



వ్యవసాయి బావిలో నుంచి దుప్పిని బయటకు తీస్తున్న అటవీ సిబ్బంది

చంద్రగిరి, మే 16: మండలంలోని నారావారిపల్లె సమీపంలో శేషాచలం అడవిలో నుంచి గురువారం తెల్లవారు జామున ఒక దుప్పి తాగునీటి కోసం వచ్చి వ్యవసాయి బావిలో పడింది. ఉదయం గ్రామస్తులు అందించిన సమాచారంతో భాకరాపేట అటవీ సిబ్బంది వ్యవసాయి బావిలో దిగి తాళ్లు కట్టి అతికష్టం మీద దానిని బయటకు తీశారు. అటవీ సిబ్బంది దుప్పికి ప్రథమ చికిత్స చేసి, అడవిలో వదిలిపెట్టారు. దుప్పిని రక్షించిన వారిలో ప్రొటెక్షన్ వాచర్స్ హేమచంద్ర, అంజి, సురేంద్ర, రోహిత్, కేశవులు పాల్గొన్నారు.

అరవింద కంటి ఆస్పత్రి సేవలు భేష్



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి(ఆటోనగర్), మే 16: ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రి సేవలు భేష్ అని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం కొనియాడారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న రాస్ మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం సేవానిలయంలో గురువారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 250మంది మహిళలకు కంటి పరీక్షలు చేసి, 50మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రఫుల్ల గాయత్రి రోగులకు పలు సూచనలు చేశారు. డైరెక్టర్ వి.నాగరాజు, వాసుదేవరెడ్డి, నాగేశ్వర్, వాణి, భార్గవి, వనజ, కరుణాకర్, బాలాజీ, సత్యనారాయణ, రామానుజులు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ నివారిద్దాం : డీఎంహెచ్‌వో



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి (వైద్యం), మే 16: ప్రతీ ఒక్కరూ దోమలు నిల్వ చేరకుండా తగిన జాగ్రత్తలు పాటించినప్పుడే సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారించగలమని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆయన వైద్యాధికారులతో కలిసి గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి డెంగ్యూపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ



చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రగిరి, మే 16: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీ నివారణ సాధ్యమని సీహెచ్‌సీ డాక్టర్ కుసుమ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా గురువారం వైద్య బృందం సిబ్బందితో కలిసి చంద్రగిరిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ కుసుమ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేని పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీహెచ్‌ఎన్ రమణమ్మ, ఎంపీహెచ్‌వో ఈశ్వరయ్య, ఆరోగ్య పర్యవేక్షకులు శ్యామల, లలిత, వాసుదేవ, వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

తిరుపతి రూరల్, మే 16: తిరుపతి రూరల్ మండల పరిషత్ సాధారణ సమావేశం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ యశోద అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రమేష్ పేర్కొన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి ఈ సమావేశం జరుగుతుందని ప్రకటించారు.

● అకాల వర్షం

మామిడి రైతుకు నష్టం


● మూడు వేల ఎకరాల్లో రాలిపోయిన కాయలు



ఐరాల మండలంలో నేల రాలిన మామిడి కాయలు

చిత్తూరు సెంట్రల్, మే 16: అకాల వర్షంతో మామిడి కాయలు నేలరాలాయి. దీంతో రైతులు నష్టపోయారు. జిల్లాల విభజన తర్వాత చిత్తూరు జిల్లాలో మామిడి సాగు ప్రధాన పంటగా మారింది. 1,71,198 ఎకరాల్లో రైతులు మామిడి సాగు చేస్తుండగా, తోతాపురి ప్రధాన రకంగా ఉంది. ఏటా ప్రతికూల వాతావరణంతో మామిడి రైతులు నష్టపోతున్నారు. ఈ ఏడాది మే నెల మొదటి వారంలో అకాల వర్షం, తరచూ ఈదురు గాలుల కారణంగా దాదాపు మూడు వేల ఎకరాల్లోని మామిడి పిందె నుంచి కాయ దశలోనే నేల రాలాయి. ఇటీవల కురిసిన వర్షాలకు 1290 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతినగా, ఇందులో 1060 ఎకరాల్లో దెబ్బతిన్న మామిడి పంట నష్టం రూ.1.93 కోట్లుగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు లెక్కలు కట్టారు. అధికారిక లెక్కలు పక్కన పెడితే క్షేత్ర స్థాయిలో పంటను కోల్పోయిన నష్టం ఇంకా ఎక్కువ ఉంటుంది. పంటను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. పూత దశ నుంచి పంట చేతికి వచ్చే వరకు యాజమాన్య పద్ధతులు పాటించేందుకు ఎకరాలకు రూ.10 వేలు రైతులు ఖర్చు చేస్తున్నారు. కాపు నుంచి చేతికి అందే వరకు సోకే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకునేందుకు సుమారు నాలుగు సార్లు వివిధ రకాలైన మందులు పిచికారి చేస్తున్నారు. ఇందుకోసం ఎకరాకు రూ.8 వేలు ఖర్చు చేయగా, కూలీలకు రూ.2 వేలు ఖర్చు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇంత ఖర్చు చేసినా దిగుబడి తక్కువే. ఉన్న మామిడి కాయలు కూడా ఇప్పుడు నేలరాలడంతో ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సుబ్రహ్మణ్యం(ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, మే 16: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం(28) అనే యువకుడు మృతి చెందాడు. రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు ఏర్పేడు మండలం పల్లంపేట దళితవాడకు చెందిన సుబ్రహ్మణ్యం శ్రీకాళహస్తిలో ఆర్టీసీ ప్రైవేటు హయర్ బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం విధులు ముగించుకుని శ్రీకాళహస్తి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ముచ్చివోలు వద్ద పాలవ్యాను, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా సుబ్రహ్మణ్యం మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

జేఈఈ-2కే23 సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్స్ సిద్ధం

తిరుపతి రూరల్, మే 16: జేఈఈ-2కే24 ఫలితాల్లో మంచిర్యాంకులు, అర్హత సాధించిన విద్యార్థులకు 2023కి సంబంధించిన సీట్ అలాట్‌మెంట్ కౌన్సెలింగ్ బుక్‌లెట్స్‌ని సిద్ధంచేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం కన్వీనర్ లలిత్‌కుమార్ పేర్కొన్నారు. ఆరు రౌండ్లుగా సాగే జేఈఈ కౌన్సెలింగ్‌లో గతేడాదిలో వచ్చిన ర్యాంకులు, సీట్లు, రిజర్వేషన్, బ్రాంచ్‌ల వివరాలను పొందుపరిచామని తెలిపారు. అలాగే ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలు, ఇతర ప్రముఖ విద్యా సంస్థల్లో సీట్లకేటాయింపు,ఓపెనింగ్,క్లోజింగ్ ర్యాంకుల వివరాలు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు డిజిటల్ బుక్‌లెట్స్‌ని వాట్సాప్ ద్వారా పొందవచ్చని, వివరాల కోసం 98490 16661కి వాట్సాప్ మెసేజ్ పంపాలని కోరారు.

కలవరపెడుతున్న ఏనుగు సంచారం

చీకటి పడితే బయటికి రావాలంటే భయపడుతున్న ప్రజలు



పాకాల మండలం బావిరాగన్నచెరువు అటవీ ప్రాంతంలో ఏనుగు జాడ కోసం డ్రోన్ కెమెరాతో గాలిస్తున్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది

పాకాల, మే 16: మండలంలో గత నాలుగు రోజులుగా ఏనుగు సంచారం ప్రజలను కలవరపెడుతోంది. సోమవారం పాకాల మండలం మణిపిరెడ్డిపల్లె వద్ద రైల్వే ట్రాక్ దాటి పాకాల పెద్దచెరువు వైపు వెళ్లింది. కుందేటిపల్లె, అడుసుపల్లె పరిసరాల్లో సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం బావిరాగన్న చెరువు, చొప్పావాని చెరువు, శ్రీరామాపురం, చలమకోన పరిసరాల్లో ఉన్నట్లు, అడవి నుంచి బయటికి రాలేదని అటవీ అధికారులు చెబుతున్నారు. గురువారం డీఎఫ్‌వో సతీష్, ఎఫ్ఆర్‌వో మాధవి, సిబ్బంది డ్రోన్ కెమెరాలతో వెతికినా ఆచూకీ లభించలేదు. ఎటువైపు వెళ్లిందో తెలియక చీకటి పడితే బయటికి రావడానికి ప్రజలు భయపడుతున్నారు. చొప్పావాని చెరువు సమీపంలో ఏనుగు పాదముద్రలు గుర్తించడంతో ఆ ప్రాంతంలో రెండు రోజులుగా వెతుకుతున్నారు. మండలంలో ఇప్పటికే పదిపుట్లబైలు, దామలచెరువు, ఈపాలగుట్టపల్లె, పేరసానిపల్లె పరిసరాల్లో ఏనుగుల దాడులతో రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు ఒంటరి ఏనుగు సంచారంతో మరింత ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఏనుగును బంధించి, అభయారణ్యాలకు తరలించి, తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రగిరిలో అతివలదే పైచేయి

పురుషుల కంటే అధికంగా ఓటేసిన మహిళలు

చంద్రగిరి, మే 16: చంద్రగిరి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలే అత్యధికంగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో ఎర్రావారిపాలెం,చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్, తిరుపతి అర్బన్ పార్ట్, రామచంద్రాపురంమండలాల్లో 3,15,159 ఓటర్లు ఉన్నారు. అందులో ఎర్రావారిపాలెంలో 22,886 మంది ఓటర్లు ఉండగా, 9,695 మంది పురుషులు.. 9,603 మంది మహిళలు, చిన్నగొట్టిగల్లు మండలంలో 21,188 మంది ఓటర్లు ఉండగా, 9,142మంది పురుషులు..9,796మంది మహిళలు, పాకాల మండలంలో 44,556 మంది ఓటర్లు ఉండగా, 18,895 మంది పురుషులు.. 20,054 మంది మహిళలు, చంద్రగిరి మండలంలో 48,464 మంది ఓటర్లు ఉండగా, 19,824 మంది పురుషులు.. 21,360 మంది మహిళలు, ఇతరులు 1, తిరుపతి రూరల్ మండలంలో 1,28,792 మంది ఓటర్లు ఉండగా, 45,050 మంది పురుషులు.. 47,727 మంది మహిళలు, ఇతరులు 14 మంది, తిరుపతి అర్బన్ పార్ట్‌లో 23,287 మంది ఓటర్లు ఉండగా, 8,232 మంది పురుషులు, 8,810 మంది మహిళలు, రామచంద్రాపురం మండలంలో 25,986 మంది ఓటర్లు ఉండగా, 11,333 మంది పురుషులు, 12,237 మంది మహిళలు, ఇతరులు 1 తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2,51,788 మంది ఓటు హక్కును సద్వినియోగం చేసుకోగా, అందులో 1,22,171 మంది పురుషులు, 1,29,587 మంది మహిళలు, ఇతరులు 30 మంది ఓటు వేశారు. దీంతో 79.89 శాతం పోలింగ్ నమోదైంది.

నానీ ఆరోగ్యం కోసం..



రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టిన టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, మే 16: మహిళా యూనివర్శిటీ వద్ద గాయపడ్డ పులివర్తి నానీ ఆరోగ్యం కోసం మండలంలోని అనిచెరువు రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద టీడీపీ నాయకులు గురువారం అమ్మవారికి పూజలు నిర్వహించి, 108 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. టీడీపీ జిల్లా కార్యదర్శి హరిప్రసాద్, సురేంద్రనాయుడు, బాలయ్య, జనార్ధన్, కల్యాణ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులు రాజకీయ ప్రత్యర్థులు కాదు

వ్యక్తిగత దాడులు ఇక ఆపండి భూమనా

ప్రజాసంఘాలు, జర్నలిస్టుల డిమాండ్



అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 16: వ్యతిరేక వార్తలు రాసిన జర్నలిస్టులపై వ్యక్తిగత నిందారోపణలు చేయడాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తక్షణం మానుకోవాలని జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులకు జర్నలిస్టులు ప్రత్యర్థులు కాదని గుర్తుంచుకోవాలన్నారు. నాయకులపై చేసినట్లుగా వ్యతిరేక వార్తలు రాసిన జర్నలిస్టులమీద ఆరోపణలు చేయడం నీచ సంప్రదాయం అన్నారు. మహిళా విశ్వవిద్యాలయంలో జర్నలిస్టులమీద లాఠీచార్జి చేయించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ, ప్రభుత్వాల వైఫల్యాలను, అవినీతిని ప్రజలకు తెలియజేయడమే పత్రికల బాధ్యత అని, దాడులు చేయడం అన్యాయమని అన్నారు. న్యాయవాది సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, బహిరంగ సభలో భూమన చేసిన వ్యాఖ్యల వల్ల జర్నలిస్టులపై మూకదాడులు జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. మీడియా స్వేచ్ఛకు భంగం కల్గించే చర్యలపై గవర్నర్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. హైకోర్టును కూడా ఆశ్రయిస్తామన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల ఈ తరహా ఆరోపణలు చేయడం భూమన స్థాయికి తగదన్నారు. ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్ మాట్లాడుతూ, మీడియా గొంతు నొక్కే చర్యలను ఎవ్వరూ ఉపేక్షించకూడదన్నారు. సీఐటీయూ నేత బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, దాడుల సంస్కృతిని ప్రోత్సహించేలా భూమన వ్యాఖ్యలు ఉన్నాయని, తిరుపతి ప్రజలు, మేధావులు, రచయితలు దీనిని ఖండించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యదర్శి దినేష్ కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతను భగ్నం చేసేలా భూమన మాట్లాడుతున్నారని, దాడులు చేసేలా వ్యాఖ్యలు చేయడం గాక జర్నలిస్టుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలని హితవు చెప్పారు.

చర్యలు తీసుకోండి

టీడీపీ లీగల్ సెల్ నేత వెంకటరమణ మాట్లాడుతూ, జర్నలిస్టులను బెదిరించినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రచయిత కోట పురుషోత్తం మాట్లాడుతూ, సహృదయుడైన ఉమామహేశ్వరరావు వంటి వారిపై భూమన కరుణాకరరెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం తనకు చాలా బాధ కల్గించిందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ, ప్రజాపోరాటాలకు అండగా నిలిచే పత్రికలకు, జర్నలిస్టులకు ప్రజా సంఘాలు తప్పక అండగా నిలుస్తాయన్నారు. సీఐ రామచంద్రారెడ్డి వైసీపీ కార్యకర్తలా మారిపోయారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నేత దినకర్ ఆరోపించారు. రాబోయే 15 రోజుల్లో వైసీపీ నాయకుల దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందనీ, ఇదంతా ఓటమి భయంతో జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. భూమన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని హమాలీ యూనియన్ నేత ఎన్‌డీ రవి డిమాండ్ చేశారు. భూమన రాజకీయ ఎదుగుదలలో పత్రికల పాత్ర లేదా అంటూ, ఇంత దిగజారి జర్నలిస్టులపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి విమర్శించారు. చేతనైతే జర్నలిస్టులపై చేసిన ఆరోపణలను నిరూపించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) కార్యదర్శి చిన్నం కాళయ్య కరుణాకరరెడ్డిని సవాల్ చేశారు.

పదునెక్కిన అక్షరం భయపెడుతుంది:అక్షరం ఎంత పదునైనదో, ఎంత శక్తివంతమైనదో, ఎంత విస్ఫోటనం కలిగించగలదో భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు అన్నారు. జర్నలిస్టుల మీద వ్యక్తిగత ఆరోపణలు చేసే దుస్సాంప్రదాయాన్ని భూమన మొదలు పెట్టారని అన్నారు. ఎప్పటికైనా భూమన తన అంతరాత్మకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. దయచేసి ఇక్కడితో ఆరోపణలు ఆపేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి శ్రీకాంత్, తిరుపతి స్థానిక హక్కుల సంఘం నేత భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యదర్శి గిరిధర్, ఆంధ్రనాడు పత్రిక ఎడిటర్ హరిబాబు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నేత కాళహస్తి గిరిబాబు, జర్నలిస్టు కోలా లక్ష్మీపతి సభలో భూమన వ్యాఖ్యలను ఖండిస్తూ, సీఐ రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రసంగించారు.

కమీషన్ల కోసం కట్టడాలు

● ముక్కంటి సొమ్ము దుర్వినియోగం
● ఇరుకు ప్రదేశంలో అనవసర నిర్మాణాలు
● రూ.40 లక్షలు కేటాయించిన పాలకమండలి



ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న దుకాణ సముదాయం

శ్రీకాళహస్తి, మే 16: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధమైన ద్రౌపదీసమేత ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో అనవసర నిర్మాణాలు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తిలోని చెన్నై రోడ్డుకు ఆనుకుని ధర్మరాజుస్వామి ఆలయం ఉంది. ఇక్కడ ఏటా జూలైలో పదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు పోటెత్తుతుంటారు. వారంరోజుల పాటు ఆలయంలో ఉత్సవాల వేళ భారతం జరుగుతుంది. ఉత్సవాల్లో చివరిరోజున పొంగళ్లు సమర్పించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోతుంది. అగ్నిగుండ మహోత్సవం సమయంలో పలుమార్లు తొక్కిసలాటలు కూడా చోటు చేసుకున్నాయి. ఇంతటి ఇరుకైన ప్రాంతంలో మూడు నెలల క్రితం ముక్కంటి ఆలయ పాలకమండలి దుకాణసముదాయం నిర్మించేలా నిర్ణయం తీసుకుంది. చెన్నై రోడ్డుకు ఆనుకుని పది దుకాణాలు నిర్మించి అయినవారికి పంచుకునేలా పథకం వేసినట్లు తెలిసింది. సుమారు రూ.40 లక్షలు ఇందుకోసం కేటాయించారు. ఇరుకైన ఆలయ స్థలంలో దుకాణ సముదాయం నిర్మించడంపై భక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల్లోనే ఉత్సవాలు జరగనున్నాయి. ఇటీవల ధర్మరాజస్వామి ఆలయ స్థలానికి ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం నిర్మించే సముదాయం కారణంగా కొంత ప్రహరీ గోడను అనవసరంగా తొలగించాల్సి ఉంటుంది. ముక్కంటి ఆలయ నిధులను కమీషన్ల కోసం దుర్వినియోగం చేస్తున్నట్లుగా పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరిగ్గా దుకాణ సముదాయం అర్జున తపస్సు జరిగే చోటే నిర్మిస్తున్నారు. అనాలోచిత నిర్ణయం కారణంగా ఈ ఏడాది అర్జున తపస్సు జరిగే చోటును మార్చక తప్పదని తెలుస్తోంది.

రుయా నేత్ర నిధికి కళ్లు దానం





వెంకట్రమణ(ఫైల్‌ఫొటో) - కళ్లను దానం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు అందజేస్తున్న అంగీకార పత్రం

తిరుపతి(వైద్యం), మే 16: గుండె పోటుకు గురైన వ్యక్తి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించడంతో.. మృతుడి కళ్లను ఆయన కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలోని నేత్ర నిధికి దానం చేశారు. స్థానిక బైరాగిపట్టెడకు చెందిన సీ.వీ.వెంకట్రమణ(64) గుండెపోటుతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న నేత్ర నిధి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. మృతుడి కుమారుడు యశ్వంత్‌కుమార్ తన తండ్రి కళ్లను దానం చేసేందుకు అంగీకరించడంతో వెంటనే కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్ర నిధిలో భద్రపరిచారు. తీరని దుఃఖంలోనూ తన తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభు అభినందించారు. నేత్ర నిధి టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించి.. కొట్టారు

● రామకుప్పం ఎస్ఐపై గిరిజనుడి ఫిర్యాదు

రామకుప్పం, మే 16: తనను కులం పేరుతో దూషించి, లాఠీతో కొట్టారంటూ రామకుప్పం మండలం వీర్నమలతాండాకు చెందిన వెంకటేష్‌నాయక్ గురువారం ఎస్ఐ శివకుమార్‌పై ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. సోదరులైన వెంకటేష్‌నాయక్, షణ్ముఖనాయక్, లోకేంద్రనాయక్ వీర్నమలతాండా సమీపంలోని పొలాల్లో వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వీరు బెంగళూరులో కంప్రెసర్ బండ్లు పెట్టుకుని, కూలిపనులు చేసుకుంటున్నారు. ఓట్లేయడానికి వీరంతా స్వగ్రామానికి వచ్చారు. కాగా, వెంకటేష్‌నాయక్‌కు వచ్చే అదనపు పనులను లోకేంద్రనాయక్‌కు ఇస్తుండటంపై, మరో సోదరుడు షణ్ముఖనాయక్ ఆగ్రహంతో ఉన్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తమ ఇంటి ముందు కత్తులు నూరుతున్న షణ్ముఖనాయక్, అతడి భార్య మంజు, కుమారుడు బాలాజీనాయక్‌ను చూసి ఎందుకిలా చేస్తున్నారని వెంకటేష్‌నాయక్ ప్రశ్నించగా, నీ కుటుంబాన్ని చంపడానికంటూ వారు దుర్భాషలాడారు. వెంటనే షణ్ముఖనాయక్ కత్తితో వెంకటేష్ కుడిచేతిపై నరికాడు. అడ్డు వచ్చిన వెంకటేష్‌నాయక్ కుమారుడు ఠాగూర్‌నాయక్‌ను బాలాజీనాయక్ కర్రతో తలపై కొట్టాడు. లోకేంద్రనాయక్ కుమారుడు ఈశ్వర్‌నాయక్ వచ్చి వారిని కాపాడారు. ఠాగూర్‌నాయక్‌ను కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బుధవారం వెంకటేష్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షణ్ముఖనాయక్, మంజు, బాలాజీనాయక్‌పై ఎస్ఐ కేసు నమోదు చేశారు. అనంతరం వెంకటేష్‌నాయక్‌తోపాటు షణ్ముఖనాయక్, లోకేశ్‌నాయక్‌ను ఎస్ఐ తన గదికి పిలిపించారు. అదే సమయంలో ఆయనకు ఫోన్ వచ్చింది. ఆ తర్వాత వారిని దుర్భాషలాడారు. దీనిపై ప్రశ్నించగా, కులం పేరుతో దూషించి, లాఠీతో కొట్టారని బాధితులు ఆవేదన చెందారు. అదే సమయంలో స్టేషనుకు వచ్చిన టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ చూసి.. వారిని ఎందుకు కొడతారంటూ ఎస్ఐని అడగ్గా, అతడినీ దుర్భాషలాడుతూ బొక్కలో వేస్తానని బెదిరించారన్నారు. ఎస్ఐపై తగు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వెంకటేష్‌నాయక్ తన ఫిర్యాదులో కోరారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోండి

దళిత, గిరిజనులే లక్ష్యంగా దాడులకు పాల్పడుతున్న ఎస్ఐ శివకుమార్‌పై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, జిల్లా కార్యదర్శి జయశంకర్, మాజీ జడ్పీటీసీ బాలాజీనాయక్, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణానాయక్, కామరాజనాయక్, గిరిజనతాండాల నేతలు డిమాండు చేశారు. వీర్నమల తాండాలో ఘర్షణ పడ్డ సోదరులు పోలీస్‌స్టేషనుకు వస్తే వారిపై ఎస్ఐ దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. ఆదివారం సాయంత్రంలోగా ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే, సోమవారం ఉదయం కుప్పం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. దీనిపై ఎస్ఐ శివకుమార్‌ను వివరణ కోరగా.. ఇదంతా టీడీపీ నేత కృష్ణానాయక్ ఆడిస్తున్న నాటకమని ఆరోపించారు. తాను ఎవరినీ కులం పేరుతో దూషించలేదని, లాఠీతో కొట్టలేదన్నారు.

రెండునెలలుగా పెరగని ధరలు

● ఆందోళనలో టమోటా రైతులు



మార్కెట్ యార్డుకు వచ్చిన టమోటాలు

పలమనేరు, మే 16: పలమనేరు మార్కెట్‌యార్డులో రెండునెలలుగా టమోటాకు గిట్టుబాటు ధర లభించక వందలాది మంది రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంతో పాటు చౌడేపల్లె, సోమల మండలాలనుంచీ రైతులు టమోటాలను పలమనేరు మార్కెట్‌యార్డుకు తీసుకు వస్తున్నారు. రెండు నెలలుగా పలమనేరు మార్కెట్ యార్డులో 15 కిలోల టమోటా బాక్సు ధర రూ. 200 దాటడం లేదు. రెండునెలలుగా వేసవిలో టమోటాకు మంచి ధరలు వస్తుందని ఆశించి వేలాది ఎకరాల్లో సాగుచేసిన రైతులకు నిరాశే మిగిలింది. టమోటా సాగుకు పెట్టిన పెట్టుబడికూడా రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కూడా పలమనేరు మార్కెట్‌యార్డులో బాక్సు కేవలం రూ.145 ధర పలికింది. ఇటీవల టమోటా సాగుకు పెట్టుబడి విపరీతంగా పెరిగిందని, దీనికి తగ్గట్టు ఎరువుల ధరలు, కూలీల ధరలు పెరగడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొన్నారు. ఎండవేడిమి కారణంగా టమోటా తోటల్లో టమోటాలు పెద్దఎత్తున మాగిపోవడంతో రైతులు గత్యంతరం లేక మార్కెట్‌కు తీసుకొచ్చి తెగనమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రెండు మినీ లారీల ఢీ

ఒకరి మృతి - మరొకరికి తీవ్ర గాయాలు





మృతిచెందిన సుదర్శన్ - నుజ్జునుజ్జయిన ఈచర్ వాహనం

గుడిపాల, మే 16: మండలంలోని బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో గురువారం ఉదయం రెండు ఈచర్లు ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. మరొకరు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి చెన్నై వైపు వెళ్తున్న ఈచర్ చెన్నై నుంచి బెంగళూరుకు వెళ్తున్న మరో ఈచర్ వాహనాన్ని ఎన్‌సీఆర్ క్రాస్‌లోని భద్రకాళమ్మ ఆలయం వద్ద ఢీకొంది. తమిళనాడుకు చెందిన ఈచర్ డ్రైవర్ సుదర్శన్ (24) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఈచర్ డ్రైవర్ షేక్ దావుద్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు అతన్ని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, మే 16: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న పనులను డీఆర్వో పుల్లయ్యతో కలిసి పరిశీలించారు. జూన్ నాలుగవ తేదీ ఎస్వీసెట్‌లో చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపడుతున్నామన్నారు. దానికి సంబంధించి కేంద్రాల లోపల టేబుళ్లు, సీటింగ్ అరెంజ్‌మెంట్లు చేపట్టాలన్నారు. లెక్కింపు ప్రక్రియ పూర్తిగా సీసీ కెమెరాల నిఘాతో వీడియోగ్రఫీ చేస్తున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆయన కళాశాలలోని స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, కమ్యూనికేషన్ మేనేజ్‌మెంట్ నోడల్ ఆఫీసర్ నరసింహులు ఆయన వెంట ఉన్నారు.

తిరుపతి







తిరుపతి(కల్చరల్), మే 16: గంగమ్మ జాతరలో భాగంగా గురువారం భక్తులు బండ వేషంలో సందడి చేశారు. ఆచారం మేరకు గురువారం ఉదయం గొల్లవేషంలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. దీనినే మందడి వేషం అని కూడా పిలుస్తారు. సాయంత్రం వేళ బండవేషంలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గొల్ల వేషాలను కైకాల, చాకలి వంశస్తులు తొలుత వేస్తారు. కైకాల వారు ఆడవేషం వేస్తే, చాకలి వారు మగవేషం వేస్తారు. అయితే బండ వేషం గతంలో ఆలయ మిరాశి వారు, గ్రామ ప్రజలు వేసేవారు. నేడు మిరాశి విధానం రద్దయిన నేపథ్యంలో నగరవాసులు బండవేషంలో అమ్మవారిని సేవిస్తున్నారు. గంగమ్మ జాతరలో భాగంగా గురువారం సాయంత్రం 7.30 గంటలకు ఇందిరా మైదానంలో తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన బాకా మణి ఆధ్వర్యంలో బాలనాగమ్మ నాటకం ప్రదర్శించారు.

నేటి వేషాలు

జాతరలో శుక్రవారం ఉదయం కోమటి వేషం వేస్తారు. సాయంత్రం తోటి వేషంలో భక్తులు అమ్మవారిని సేవిస్తారు.







బండోళ్లం.. కాపాడు గంగమ్మా..!





గొల్ల వేషంలో చాకలి, కైకాల వంశస్తులు





బాలనాగమ్మ నాటకం కళాకారులకు సత్కారం







వేశాలమ్మ

అమ్మవారికి ఎమ్మెల్యే భూమన సారె

గురువారం ఉదయం తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తన కుమారుడు అభినయ్, కుటుంబీకులతో కలిసి అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటి వద్ద నుంచి ఆలయం వరకు కళాజాత నిర్వహించారు. ఈ ప్రదర్శనలో తిరుపతి ఎంపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ.. కొన్ని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన గంగమ్మ జాతరలో సారె తీసుకొచ్చే అవకాశం రావడం సంతోషకరమని చెప్పారు. గత ఏడాది నుంచి రాష్ట్ర పండుగగా జాతర నిర్వహిస్తున్నామన్నారు. ఎంతో విశిష్టమైన గంగమ్మకు నూతన ఆలయం నిర్మించే అవకాశం రావడం కూడా తన అదృష్టంగా పేర్కొన్నారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 81,930 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 41,224 మంది తలనీలాలు సమర్పించారు.

డాక్టరేట్ ప్రదానం



స్వామి కణ్ణన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 16: ఎస్వీయూ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ స్కాలర్ కె.స్వామి కణ్ణన్ డాక్టరేట్ పొందారు. ద రోల్ ఆఫ్ సర్వశిక్ష అభియాన్ ఇన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ ఎడ్యుకేషన్: ఓ కేస్ స్టడీ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్ అంశంపై ప్రొఫెసర్ బీవీ మురళీధర్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కణ్ణన్ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. వీరు రూపొందించిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. ఈ మేరకు సీతః దామ్లానాయక్ తెలిపారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

స్వల్పగాయాలతో బయటపడిన మహారాష్ట్ర భక్తులు



ప్రమాదానికి గురైన కారు

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌లో ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈప్రమాదంలో మహారాష్ట్రకు చెందిన భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మహారాష్ట్రలోని సంగ్లీకి చెందిన ఐదుగురు భక్తులు శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం తమ కారులో గురువారం ఉదయం తిరుమల నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గ మధ్యంలోని ఓ మలుపు వద్ద కారు అదుపుతప్పి కుడివైపునున్న చిన్నగట్టును ఢీకొని అడవిలోకి దూసుకెళ్లి, ఓ చెట్టును ఢీకొని ఆగింది. అదృష్టవశాత్తూ ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో వాహనంలోని ఐదుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. టీటీడీ ఆటోక్లినిక్ సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును తిరుపతికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారిస్తున్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), మే 16: తిరుపతి-చంద్రగిరి మార్గంలోని జూపార్కుకు సమీపంలోని వీవర్స్ కాలనీ వద్ద రైలు పట్టాలపై ఓ వ్యక్తి(53) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. రైల్వే పోలీసులకు సమాచారమివ్వగా, వారొచ్చి పరిశీలించారు. వ్యక్తిగత వివరాలేమీ లభ్యంకాలేదని, ఆచూకీ తెలిసినవారు రైల్వే ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ (సెల్: 94942 28854)ని సంప్రదించాలని సూచించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



సుజనా చౌదరి - దేవీశ్రీ గురూజీ, కేవీఎల్ హరినాథ్ - కంచర్ల శ్రీకాంత్

తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకన్నను గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, సుజనాచౌదరి, రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ చైర్మన్ కేవీఎల్ హరినాథ్, టీడీపీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీకాంత్, ఆధ్యాత్మిక ప్రవచనవేత్త దేవీశ్రీ గురూజీ(ఓంకారం), తెలంగాణ ఎమ్మెల్యే గోపాల్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

పరకామణికి కరెన్సీ కౌంటింగ్ మెషిన్ విరాళం

తిరుమల, మే16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి(హుండీ కానుకల లెక్కింపు)కి గురువారం ఓ కరెన్సీ కౌంటింగ్ మెషిన్ విరాళంగా అందింది. నెల్లూరుకు చెందిన కాకులూరు వసంతకుమార్, కర్పగవల్లి దంపతులు రూ.9.33 లక్షల విలువైన ఈ యంత్రాన్ని పరకామణి డిప్యూటీఈవో మల్లికార్జునకు అందజేశారు.



గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతి (కల్చరల్), మే 16: తిరుపతి గోవిందరాజ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో వేడుకగా మొదలయ్యాయి. ఉదయం 8.15 నుంచి 8.40 గంటల మధ్య వేదమంత్రాలు, సంగీత వాయిద్యగోష్టి మధ్య గరుడధ్వజపటం ఆవిష్కరించారు. అనంతరం స్వామివారికి ఆస్థానం జరిగింది. అంతకుముందు గరుడధ్వజపటం, చక్రత్తాళ్వారు, పరివార దేతలను ఆయల నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. విష్వక్సేన ఆరాధన, గరుడ ప్రతిష్ఠ, రక్షాబంధనం చేపట్టారు. 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం జరిగింది. సాయంత్రం 5.30 నుంచి ఆరు గంటల వరకు స్వామివారి ఊంజలసేవ భక్తులకు నేత్రానందాన్ని కల్గించింది. ఏడు గంటలకు పెద్ద శేషవాహన సేవ నిర్వహించగా, మాడవీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో జీయర్ స్వాములు, ఎఫ్ఏ అండ్ సీఏవో బాలాజి, సీఈ నాగేశ్వరరావు, ఆగమ సలహాదారు సీతారామాచార్యులు, మోహన రంగాచార్యులు, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, ధనంజయ, ఇతర అధికారులు, పండితులు పాల్గొన్నారు.

నేటి వాహనసేవలు

గోవిందరాజ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం చిన్నశేష, రాత్రికి హంసవాహన సేవలు జరుగుతాయి.



ధ్వజారోహణం



సాంస్కృతిక ప్రదర్శన



పెద్ద శేషవాహనంపై స్వామివారు

ఫలపుష్ప శోభితం పద్మావతి పరిణయోత్సవ మండపం

- మొదటిసారిగా కేరళ సంప్రదాయ అలంకరణ 'తెప్పకోలం'



తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో శుక్రవారం నుంచి పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా పరిణయోత్సవ మండపాన్ని వివిధ రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. గతంలో పసుపు- కుంకుమ మండపం, గాజుల మండపం, రంగురాళ్ల మండపం, అష్టలక్ష్మీ మండపం, దశవతార మండపం వంటి నమూనాలతో భక్తులను ఆకట్టుకునేలా టీటీడీ ఉద్యానవన శాఖ అలంకరణలు చేపట్టింది. ఈఏడాది మొట్టమొదటిసారిగా కేరళ సంప్రదాయ 'తెప్పకోలం' అనే అలంకరణతోపాటు ఫల పుష్పాలతో, విద్యుద్దీపాలతో భక్తులను ఆకట్టుకునేలా మండపాన్ని తీర్చిద్దుతున్నారు. ఇందులో రోజా, లిల్లీ, చామంతి వంటి రెండు టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50వేల కట్ ఫ్లవర్స్(15 రకాలు), వివిధ రకాల ఫలాలు, ఏనుగులు, గుర్రాలు, చిన్నకృష్ణుడు వంటి సెట్టింగులతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. మండపం పైభాగంలో ఏర్పాటు చేసిన వెన్న ఉట్లు, వెండి గంటలు, పూల గుత్తులు ఆకట్టుకోనున్నాయి. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో బెంగళూరుకు చెందిన 150 మంది నిపుణులైన సిబ్బందితోపాటు టీటీడీ గార్డెన్ విభాగానికి చెందిన మరో 50 మంది సిబ్బంది వారం రోజులుగా పద్మావతి పరిణయోత్సవ మండపాన్ని అలంకరిస్తున్నారు. ఈ మండపం అలంకరణను పుణెకు చెందిన శ్రీవేంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు విరాళంతో టీటీడీ చేస్తోంది.

బయో వ్యర్థాలకు మరోసారి నిప్పు

భారీగా చెలరేగిన మంటలు ● సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంతో తప్పిన ముప్పు

తిరుపతి(వైద్యం), మే 16: రుయాస్పత్రి ఆవరణలో ఇప్పటికే రెండుసార్లు అగ్నిప్రమాదం సంభవించిన బయో వ్యర్థాల నిల్వ చేసే ప్రదేశంలో గురువారం మరోసారి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆస్పత్రి ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా బయో వ్యర్థాలను, సాధారణ చెత్తాచెదారాన్ని కలిసి నిల్వ చేస్తున్నారు. నెల కిందట గుర్తు తెలియని వ్యక్తులు వీటికి నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున చెలరేగిన మంటలను వెంటనే అగ్నిమాపక అధికారులు వచ్చి అదుపు చేశారు. ఇది జరిగిన వారం రోజుల వ్యవధిలోనే మరోసారి అదే విధంగా జరిగింది. ఇక్కడ బయో వ్యర్థాలను వేయడంతోపాటు సిబ్బందే వాటికి నిప్పు పెట్టి కాలుస్తున్నారని, దీనిపై రుయా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే ఇది మళ్లీ పునరావృతం అవుతుందని రోగులు హెచ్చరించారు. దీంతో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మానాయక్ బుధవారం భారీ ఎత్తున నిల్వ చేసివున్న బయో వ్యర్థాలను పరిశీలించి వెంటనే తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. కానీ మరుసటి రోజునే ఆ బయో వ్యర్థాలకు నిప్పంటుకొని కాలి బూడిదవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఉద్దేశపూర్వకంగానే కొందరు సిబ్బంది బయో వ్యర్థాలకు నిప్పు పెట్టి కాల్చారని అధికారులు చెబుతున్నారు. ఇకనైనా దీనిపై రుయా అధికారులు గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



మంటల్లో కాలుతున్న బయో వ్యర్థాలు (ఇన్‌సెట్లో) బూడిద

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



రెడ్డి హర్షితకు నగదు అందిస్తున్న కోడూరు బాలసుబ్రహ్మణ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 16: తల్లిదండ్రులను కోల్పోయిన నిరుపేద విద్యార్థిని రెడ్డి హర్షితకు తిరుపతిలోని సుదర్శన్ ఆటో యూనియన్ రెండు లక్షల 60 వేల రూపాయల ఆర్థిక సాయం అందించింది. యూనియన్ గౌరవాధ్యక్షుడు కోడూరు బాలసుబ్రహ్మణ్యం ద్వారా ఈ మొత్తాన్ని ప్రెస్‌క్లబ్‌లో గురువారం విద్యార్థినికి అందించారు. కోడూరు మాట్లాడుతూ.. 11 ఏళ్ల కిందట విద్యార్థిని తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. దాంతో సుదర్శన్ ఆటో యూనియన్ అధ్యక్షుడు ఖాజా.. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రూ.లక్ష 60వేలను సమీకరించారని చెప్పారు. ఈమొత్తాన్ని అప్పట్లో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయగా, ప్రస్తుతం రూ.2లక్షల 60వేలు అయ్యిందన్నారు. డాక్టర్ కావాలనుకునే రెడ్డి హర్షితకు ఈ సమయంలో నగదు అందించడం హర్షణీయమన్నారు. తాను కూడా విద్యార్థినికి తనవంతు సాయం చేస్తానని ఈ సందర్భంగా కోడూరు హామీ ఇచ్చారు.

ఎవరు గెలుస్తారు...

ఎక్కడ చూసినా ఇదే చర్చ

తడ, మే 16: ఎవరు గెలుస్తారు... ఎవరికి అధికారం దక్కుతుంది.. ఎవరికి మెజార్టీ వస్తుంది.. ఇది ఏ ఇద్దరు, ముగ్గురు కలసినా చర్చించుకుంటున్న మాటలు. ఏ దుకాణం, టీ అంగళ్ల వద్ద ఈ తరహా చర్చలు జరుగుతున్నాయి. సోమవారం పోలింగ్ ముగిసింది. ప్రజల తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. వీటిని లెక్కించి విజయం ఎవరిని వరించిందో తెలుసుకునేందుకు మరో 20 రోజుల సమయం ఉంది. అయితే ఈ విజయంపై పట్టణాల్లో, గ్రామాల్లో ఎక్కడ చూసినా చర్చ నడుస్తోంది. ఫలాన అభ్యర్థికి ఆ ఊరిలో ఓట్లు ఎక్కువ పడ్డాయని, ఈ వీధిలో తక్కువపడ్డాయని, వీరికి ఇక్కడ మెజార్టీ వస్తుందని ఇలా రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఖచ్చితంగా ఆ పార్టీ అధికారంలోకి వస్తుందని వాదనలు సైతం జరుగుతున్నాయి. ఎన్నికల ప్రచారాన్ని పెద్దగా పట్టించుకోని ప్రజలు ఓటు వేసిన తరువాత వచ్చే ప్రభుత్వం గెలుపొందే ప్రజా ప్రతినిధులపై ఆసక్తిని కనబరుస్తున్నారు. ఈ మేరకు ఎక్కడ చూసినా ఇటువంటి చర్చలే నడుస్తున్నాయి. మరో 20 రోజులు ఆగితేగాని ఈ ఫలితాలు వెలువడే ఆస్కారం లేకపోవడంతో ఈ చర్చలు ఇలాగే కొనసాగే అవకాశం ఉంది.

హింసాత్మక ఘటనలకు పాల్పడొద్దు

బాలాయపల్లి, మే16: హింసాత్మక ఘటనలకు తావివ్వద్దంటూ గురువారం టీడీపీ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ సి.సి.నాయుడికి బాలాయపల్లి పోలీసులు నోటీసులు అందజేశారు. పోలీసుల వివరాల మేరకు... మండలంలో వైసీపీ నాయకురాలు దేవికా చౌదరికి, టీడీపీ నేత సీ.సీ. నాయుడుకి సెక్షన్ 149 సీఆర్‌పీసీ కింద నోటీసులు జారీ చేయమని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈక్రమంలో సీసీ నాయుడుకి నోటీసులు అందజేశాకె. వైసీపీ నాయురాలు దేవికా చౌదరి అందుబాటులో లేకపోవడంతో నోటీసులు ఇవ్వలేదని ఎస్‌ఐ మహబూబ్ సుభాని తెలిపారు. తిరుపతి జిల్లాలో ఎన్నికల అనంతరం తలెత్తిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో బాలాయపల్లి మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. తదుపతి ఉత్తర్వులు వెలువడే వరకు ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టరాదన్నారు.

నేటినుంచి బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



ఆహ్వాన ప్రతులను ఆవిష్కరిస్తున్న కమిటీ

సూళ్లూరుపేట, మే 16: సూళ్లూరుపేటలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న విరాట్ పోతులూరు వీర బ్రహ్మేంద్రస్వామి మఠంలో ఈనెల 17న శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని కమిటీ అధ్యక్షుడు చిట్టేటి పెరుమాల్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం మఠం వద్ద ప్రచార కరప్రతులను ఆవిష్కరించారు. యేటా నిర్వహించే ఆరాధన ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం గణపతి పూజ, హోమం, గో పూజతో ప్రారంభమవుతుందన్నారు. 18. స్వామి వారి కల్యాణం, రాత్రి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 19న సుదర్శన హోమం, స్వామి వారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. కమిటీ సభ్యులు ఎన్.వి.రమ ణయ్య, గిరిఆచారి, బట్టా సుబ్రమణ్యం యాదవ్, సీహెచ్ రామదాస్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



రామచంద్రారెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు

చిల్లకూరు, మే 16: పోలింగ్ సందర్భంగా ఎస్‌ఐ దాడి చేయడంతో గాయపడిన టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డిని ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు గురువారం చిల్లకూరులోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా వరప్రసాద రావు మాట్లాడుతూ చిల్లకూరులో పోలింగ్ రోజున జరిగిన వివాదంలో ఎస్‌ఐ అంజిరెడ్డి అత్యుత్సాహాన్ని ప్రదర్శించడం మంచిపద్ధతి కాదన్నారు. కేసును పక్కదారి పట్టించేలా చూస్తున్నారన్నారు. టీడీపీ నాయకులపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకులపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టాభిరామిరెడ్డి, బిందురెడ్డి, పురుషోత్తంరెడ్డి, దినేష్, శ్రీనివాసులు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి టీడీపీ అండ



గోపాల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న పాశిం , గంగాప్రసాద్

చిల్లకూరు, మే 16: వైసీపీ నాయకుల దాడిలో తీవ్ర గాయాలపాలైన టీడీపీ నాయకుడు గోపాల్ కుటుంబానికి టీడీపీ అన్నివిధాలా అండగా ఉంటుందని టీడీపీ అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు కొండేపాటి గంగాప్రసాద్‌తో కలిసి చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న గోపాల్‌ను పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పాశిం మాట్లాడు తూ... వైసీపీ నాయకులు దాడు లకు దిగడం, దౌర్జన్యాలకు పాల్ప డడం మంచి పద్ధతి కాదన్నారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ నాయకులపై దాడులను ఖండిస్తు న్నామన్నారు. కార్యకర్తలకు అండ గా నిలుస్తామన్నారు. కార్యక్ర మంలో తానంకి నానాజీ, వెంక టేశ్వర్లురెడ్డి, జి.కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

దోషులపై చర్యలు తీసుకోండి

బాలాయపల్లి, మే16: వెంకట గిరి పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై వెంటనే చర్యలు తీసుకో వాలని ఏపీ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ పోరాట సమితి వ్యవ స్థాపక అధ్యక్షుడు కె.ఆర్. దాసరి డిమాండ్ చేశారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సూళ్లూరుపేట, మే 16: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో అన్నదానం జరిగింది. లయన్స్ క్లబ్ సభ్యుడు సుబ్ర మణ్యం రెడ్డి దంపతులు పెళ్లిరోజు పురస్కరించుకొని అన్నదానం నిర్వహించామని క్లబ్ అధ్యక్షుడు ఆదిశేషా రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాస జెట్టి, కోశాధికారి అప్పారావు సభ్యులు పాల్గొన్నారు.

పరకామణికి కరెన్సీ కౌంటింగ్ మెషిన్ విరాళం

తిరుమల, మే16 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి(హుండీ కానుకల లెక్కింపు)కి గురువారం ఓ కరెన్సీ కౌంటింగ్ మెషిన్ విరాళంగా అందింది. నెల్లూరుకు చెందిన కాకులూరు వసంతకుమార్, కర్పగవల్లి దంపతులు రూ.9.33 లక్షల విలువైన ఈ యంత్రాన్ని పరకామణి డిప్యూటీఈవో మల్లికార్జునకు అందజేశారు.

చంద్రుడి చుట్టూ ఉన్న వలయాకారం

మంచి వర్షాలకు సూచన అంటున్న రైతులు



గూడూరు అర్బన్, మే 16: ఆకాశంలో గురువారం రాత్రి చంద్రగుడి కన్పించింది. వేసవిలో చంద్రుడు చుట్టూ ప్రకాశంతమైన వలయాకారం ఏర్పడితే దాన్ని పెద్దలు చంద్రగుడిగా చెబుతుంటారు. ఈ సమయంలో చంద్రుడు శక్తివంతంగా ఉండడంతో ఆ ప్రకాశం కొన్నిరెట్లు అధికంగా ఉంటుందంటున్నారు. ఇది మంచి వర్షాలకు సూచికగా నిలుస్తుందని పెద్దలు, రైతులు అంటున్నారు.

ఆశాజనకంగా పెసర ధరలు... ఆనందంలో రైతులు





నూర్పిడికి సిద్ధం చేసి ఉన్న పెసర - దెబ్బతినకుండా కుప్పగా వేసి ఉన్న పెసర

కోట, మే 16: ఈ ఏడాది పెసర ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల ఆనందాలకు అవధుల్లేవు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాల డెల్టా రైతులు ఫిల్టర్ పాయింట్ల కింద హైబ్రిడ్, నాటు రకం పెసరను సాగు చేశారు. ఎడగారు వరి సాగు ప్రారంభమైన నేపథ్యంలో పొలాల్లో చివరి దశలో ఉన్న పెసర పంటను రైతులు కోసి నూర్పిళ్లు చేస్తున్నారు. మండల పరిధిలోని తిన్నెలపూడి, వంజివాక, కేశవరం, చిట్టేడు, ఊనుగుంట పాళెం, రుద్రవరం, రాజుపాళెం తదితర గ్రామాల్లో పెసర నూర్పిడి జోరుగా సాగుతోంది. ఈ ఏడాది ఎకరానికి 4 నుంచి 5 బస్తాలు దిగుబడులు వస్తున్నాయి. గతంలో 3 నుంచి 4 లోపే దిగుబడులు వచ్చేవి. 100 కిలోల నాటు పెసర రూ.11వేల వరకు పలుకుతోంది. గుంటూరు, చీరాల తదితర ప్రాంతాల్లో ఇక్కడ పండించిన పెసరకు డిమాండ్ ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో పెసరకు డిమాండ్ ఉండటం, ధరలు పెరగడటంతో ఆయా ఫిల్టర్ పాయింట్ల కింద సాగు చేసే రైతులంతా పెసరవైపే మొగ్గు చూపుతున్నారు.

పోలేరమ్మ జాతర చాటింపు వేశారు... ముఖం చాటేస్తున్నారు!



పోలేరమ్మ ఆలయం

నాయుడుపేట టౌన్, మే 16: నాయుడుపేట గ్రామ దేవత పోలేరమ్మ జాతర యేటా మే మాసంలో నిర్వహించడం ఆనవాయితీ. ఎన్నికల నోటిఫికేషన్‌తో పాలకమండలి రద్దు కావడం, దేవదాయ శాఖ పర్యవేక్షణలోకి గ్రామదేవత పోలేరమ్మ జాతర వెళ్లింది. జాతరను మే 28, 29 తేదీల్లో నిర్వహించేలా ఏప్రిల్‌లో చాటింపు వేశారు. ఎన్నికలు పూర్తికావడంతో జాతర కోసం పోలేరమ్మ భక్తులు ఎదురు చూస్తున్నారు. అయితే గత పాలకమండలిలో తలెత్తిన వర్గ విభేధాలు ఈ జాతరపై ప్రభావం చూపుతున్నాయి. పేరుకు దేవదాయశాఖ పర్యవేక్షణలో జాతర జరుగుతుందన్న మాటేకాని నిర్వహణ అంతా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోనే కొనసాగుతుందనేది జగమెరిగిన సత్యం. గ్రామదేవత హుండీ లెక్కింపు సమయంలో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అమ్మవారి ఖాతాలో జమ అవుతుంది. అయితే ఈ నగదు మంచి నీళ్లప్రాయంగా ఖర్చు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. జాతర ఏర్పాటు కోసం ఒక్కసారి చాటింపు వేసి నిలిపివేస్తే గ్రామానికి అరిష్టమన్న ఆవేదన భక్తుల్లో వ్యక్తమవుతోంది. ఇకనైనా దేవదాయశాఖ అధికారులు ముందుగా నిర్ణయించిన తేదీల ప్రకారం పోలేరమ్మ జాతరను నిర్వహించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అంతులేకుండా పోతోంది



మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు

గూడూరు, మే 16: రాష్ట్రంలో వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అంతు లేకుండా పోయిందని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు అన్నారు. గురువారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కూటమి అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో వైసీపీ పాలన అవినీతిమయంగా సాగిందన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నా రన్నారు. చిల్లకూరు మండలంలో సిలికా అక్రమ రవాణ కారణంగా పేదలు వ్యవసాయ భూములు, నివాసాలు కోల్పోతున్నారన్నారు. ఈ విషయాన్ని పలుసార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే సిలికా అక్రమ రవాణాను అరికడతామన్నారు. ఎన్నికల సందర్భంగా చిల్లకూరు మండలంలో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడి చేయడం అమానుషమన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసులు, ఏ.బాలకృష్ణమనాయుడు, బి.చెంచురామయ్య, వెంకటేశ్వర్లు రాజు, పి.పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ నివారణ





అత్తివరం , పెళ్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన అవగాహన ర్యాలీలు

ఓజిలి, మే 16: మండలం అత్తివరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం జాతీయ డెంగ్యూ దినం సందర్భంగా గ్రామంలో వైద్యఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సిబ్బంది డెంగ్యూపై అవగాహన కల్పించేలా నినాదాలతోపాటు గ్రామంలోని పలు కూడళ్ల వద్ద ప్రజలకు ఆరోగ్య సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో అత్తివరం వైద్యాధికారి మోహనరంగ, ఎంపీహెఈవో రాజగోపాల్, హెల్త్ ఎడ్యుకేటర్ సుభాషిణి, ఎంపీహెచ్‌ఏ సుకుమారి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకూరు: జాతీయ డెంగీ దినం సందర్భంగా డెంగ్యూ నివారణపై అవగాహన కల్పిస్తూ చిల్లకూరులోని పలు వీధుల్లో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు తేజశ్విని, గీతావాణి మాట్లాడుతూ... దోమలు ఉత్పత్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకునేలా జాగ్రత్తలు పాటించాలన్నారు. దోమ తెరలను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానుమూర్తిరావు, తహసీల్దారు భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మెహబూబీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని పెళ్లకూరు, చెంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గురువారం జాతీయ డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. దోమలు ప్రబలకుండా ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని సూచించారు.

జర్నలిస్టులు రాజకీయ ప్రత్యర్థులు కాదు

వ్యక్తిగత దాడులు ఇక ఆపండి భూమనా ● ప్రజాసంఘాలు, జర్నలిస్టుల డిమాండ్



అఖిలపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 16: వ్యతిరేక వార్తలు రాసిన జర్నలిస్టులపై వ్యక్తిగత నిందారోపణలు చేయడాన్ని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తక్షణం మానుకోవాలని జర్నలిస్టులు, వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులకు జర్నలిస్టులు ప్రత్యర్థులు కాదని గుర్తుంచుకోవాలన్నారు. నాయకులపై చేసినట్లుగా వ్యతిరేక వార్తలు రాసిన జర్నలిస్టులమీద ఆరోపణలు చేయడం నీచ సంప్రదాయం అన్నారు. మహిళా విశ్వవిద్యాలయంలో జర్నలిస్టులమీద లాఠీచార్జి చేయించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ మాట్లాడుతూ, ప్రభుత్వాల వైఫల్యాలను, అవినీతిని ప్రజలకు తెలియజేయడమే పత్రికల బాధ్యత అని, దాడులు చేయడం అన్యాయమని అన్నారు. న్యాయవాది సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, బహిరంగ సభలో భూమన చేసిన వ్యాఖ్యల వల్ల జర్నలిస్టులపై మూకదాడులు జరిగితే బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. మీడియా స్వేచ్ఛకు భంగం కల్గించే చర్యలపై గవర్నర్‌ను కలిసి విన్నవిస్తామన్నారు. హైకోర్టును కూడా ఆశ్రయిస్తామన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి మాట్లాడుతూ, జర్నలిస్టుల పట్ల ఈ తరహా ఆరోపణలు చేయడం భూమన స్థాయికి తగదన్నారు. ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్ మాట్లాడుతూ, మీడియా గొంతు నొక్కే చర్యలను ఎవ్వరూ ఉపేక్షించకూడదన్నారు. సీఐటీయూ నేత బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, దాడుల సంస్కృతిని ప్రోత్సహించేలా భూమన వ్యాఖ్యలు ఉన్నాయని, తిరుపతి ప్రజలు, మేధావులు, రచయితలు దీనిని ఖండించాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యదర్శి దినేష్‌కుమార్ మాట్లాడుతూ, జర్నలిస్టుల ఐక్యతను భగ్నం చేసేలా భూమన మాట్లాడుతున్నారని, దాడులు చేసేలా వ్యాఖ్యలు చేయడం గాక జర్నలిస్టుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలని హితవు చెప్పారు.

చర్యలు తీసుకోండి

టీడీపీ లీగల్ సెల్ నేత వెంకటరమణ మాట్లాడుతూ, జర్నలిస్టులను బెదిరించినవారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రచయిత కోట పురుషోత్తం మాట్లాడుతూ, సహృదయుడైన ఉమామహేశ్వరరావు వంటి వారిపై భూమన కరుణాకర రెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం తనకు చాలా బాధ కల్గించిందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర మాట్లాడుతూ, ప్రజా పోరాటాలకు అండగా నిలిచే పత్రికలకు, జర్నలిస్టులకు ప్రజా సంఘాలు తప్పక అండగా నిలుస్తాయన్నారు. సీఐ రామచంద్రారెడ్డి వైసీపీ కార్యకర్తలా మారిపోయారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర నేత దినకర్ ఆరోపించారు. రాబోయే 15 రోజుల్లో వైసీపీ నాయకుల దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందనీ, ఇదంతా ఓటమి భయంతో జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. భూమన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని హమాలీ యూనియన్ నేత ఎన్‌డీ రవి డిమాండ్ చేశారు. భూమన రాజకీయ ఎదుగుదలలో పత్రికల పాత్ర లేదా అంటూ, ఇంత దిగజారి జర్నలిస్టులపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండి చలపతి విమర్శించారు. చేతనైతే జర్నలిస్టులపై చేసిన ఆరోపణలను నిరూపించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎ) కార్యదర్శి చిన్నం కాళయ్య కరుణాకరరెడ్డిని సవాల్ చేశారు.

పదునెక్కిన అక్షరం భయపెడుతుంది

అక్షరం ఎంత పదునైనదో, ఎంత శక్తివంతమైనదో, ఎంత విస్ఫోటనం కలిగించగలదో భూమన కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు నిరూపిస్తున్నాయని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు అన్నారు. జర్నలిస్టుల మీద వ్యక్తిగత ఆరోపణలు చేసే దుస్సాంప్రదాయాన్ని భూమన మొదలు పెట్టారని అన్నారు. ఎప్పటికైనా భూమన తన అంతరాత్మకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. దయచేసి ఇక్కడితో ఆరోపణలు ఆపేయాలని కోరారు. ఈ సమావేశంలో ప్రెస్‌క్లబ్ కోశాధికారి శ్రీకాంత్, తిరుపతి స్థానిక హక్కుల సంఘం నేత భాస్కర్, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, డాక్టర్ కో దూరు బాలసుబ్రహ్మణ్యం, ఏపీయూడబ్ల్యూజే మాజీ కార్యదర్శి గిరిధర్, ఆంధ్రనాడు పత్రిక ఎడిటర్ హరిబాబు, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ నేత కాళహస్తి గిరిబాబు, జర్నలిస్టు కోలా లక్ష్మీపతి సభలో భూమన వ్యాఖ్యలను ఖండిస్తూ, సీఐ రామచంద్రారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రసంగించారు.

ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో ఖాళీలు

దరఖాస్తులకు ఆహ్వానం

గూడూరు అర్బన్, మే 16: స్థానిక మాళవ్యానగర్‌లోని ఏపీటీడబ్ల్యూఆర్ పాఠశాలలో బాలికలకు సంబంధించి 2024-25 విద్యాసంవత్సరానికి ఖాళీలను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. 3వ తరగతిలో 40, 4వ తరగతిలో 35, 5వ తరగతిలో 30, 6వ తరగతిలో 7, 7వ తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. దరఖాస్తులను ఈనెల 20వ తేదీలోపు అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నెం.8333925187, 8885372878, 9441596331లలో సంప్రదించాలన్నారు.

గూడూరులో మారిన వాతావరణం

గూడూరు అర్బన్, మే 16: గత కొద్దిరోజులుగా ఎండతీవ్రతతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఈ క్రమంలో గురువారం ఉదయం పట్టణంలో ఆకాశం మేఘావృతమై ఎండ వేడిమి తగ్గడంతో వాతావరణంలో చోటుచేసుకుంది. ఎండ తీవ్రత కారణంగా ఉక్కపోతకు అల్లాడిపోయిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో సేద తీరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



సర్వసభ్య సమావేశంలో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీపీ, ఎంపీడీవో, తహసీల్దారు

చిల్లకూరు, మే 16: మండలంలోని తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి అధికారులు చర్యలు తీసుకో వాలని ఎంపీపీ వెంకటరమణమ్మ చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ చిల్లకూరు, చింతవరం గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను అందుబా టులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. అధికారులకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారు కళాశాలలో చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెంగయ్య, ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో భానుమూర్తిరావు, తహసీల్దారు భాగ్యలక్ష్మి, పలుశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ పరీక్షలు ప్రారంభం



కోట, మే 16: మండల పరిధిలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో గురువారం డిగ్రీ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కోట, విద్యానగర్‌లలోని డిగ్రీ విద్యార్థులకు ఇక్కడ పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రంలో 242 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం సెమ్-2 పరీక్షలు ప్రారంభమై జూన్ మొదటి వారం వరకు కొనసాగనున్నాయి.

తాగునీటి పైపు లీకేజీ

వెంకటగిరిటౌన్, మే 16: మున్సిపాలిటీ పరిధిలోని బంగారుపేట, ఎన్టీఆర్ కాలనీ, తోలిమిట్ట, గొల్లపాళెం, పీర్జాతి పేట, మాసాపేట ప్రాంతాల్లో తాగునీరు పైపు లీకేజీలు అవుతున్నాయి. గత ఇరవై రోజులుగా తాగునీరు వృథా అవుతున్నా మున్సిపాలిటీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో పలు వార్డుల్లో తాగునీటి సమస్య జటిలమవుతోంది. సమస్య పరిష్కరించకపోవడంతో వార్డు ప్రజలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైపులైనను మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాల్సి ఉంది.

కమీషన్ల కోసం కట్టడాలు

- ముక్కంటి సొమ్ము దుర్వినియోగం
- ఇరుకు ప్రదేశంలో అనవసర నిర్మాణాలు
- రూ.40 లక్షలు కేటాయించిన పాలకమండలి



ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న దుకాణ సముదాయం

శ్రీకాళహస్తి, మే 16: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ ప్రాంగణంలో అనవసర నిర్మాణాలు చేపట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శ్రీకాళహస్తిలోని చెన్నై రోడ్డుకు ఆనుకుని ధర్మరాజుస్వామి ఆలయం ఉంది. ఇక్కడ ఏటా జూలైలో పదిరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు వేలాదిగా భక్తులు పోటెత్తుతుంటారు. వారంరోజుల పాటు ఆలయంలో ఉత్సవాల వేళ భారతం జరుగుతుంది. ఉత్సవాల్లో చివరిరోజున పొంగళ్లు సమర్పించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోతుంది. అగ్నిగుండ మహోత్సవం సమయంలో పలుమార్లు తొక్కిసలాటలు కూడా చోటు చేసుకున్నాయి. ఇంతటి ఇరుకైన ప్రాంతంలో మూడు నెలల క్రితం ముక్కంటి ఆలయ పాలకమండలి దుకాణసముదాయం నిర్మించేలా నిర్ణయం తీసుకుంది. చెన్నై రోడ్డుకు ఆనుకుని పది దుకాణాలు నిర్మించి అయినవారికి పంచుకునేలా పథకం వేసినట్లు తెలిసింది. సుమారు రూ.40 లక్షలు ఇందుకోసం కేటాయించారు. ఇరుకైన ఆలయ స్థలంలో దుకాణ సముదాయం నిర్మించడంపై భక్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. రెండు నెలల్లోనే ఉత్సవాలు జరగనున్నాయి. ఇటీవల ధర్మరాజస్వామి ఆలయ స్థలానికి ప్రహరీ నిర్మించారు. ప్రస్తుతం నిర్మించే సముదాయం కారణంగా కొంత ప్రహరీ గోడను అనవసరంగా తొలగించాల్సి ఉంటుంది. ముక్కంటి ఆలయ నిధులను కమీషన్ల కోసం దుర్వినియోగం చేస్తున్నట్లుగా పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరిగ్గా దుకాణ సముదాయం అర్జున తపస్సు జరిగే చోటే నిర్మిస్తున్నారు. అనాలోచిత నిర్ణయం కారణంగా ఈ ఏడాది అర్జున తపస్సు జరిగే చోటును మార్చక తప్పదని తెలుస్తోంది.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు



శ్రీకాళహస్తి, మే 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ట ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక క్రతువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్రహారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వేదపండితులు, అలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు పర్మిట్ లేకపోతే చర్యలు తప్పవు

కేవీబీపురం,మే16: పర్మిట్ లేకుండా వాహనాలు రోడ్లపై తిరిగితే చర్యలు తీసుకుంటామని శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర నాయుడు హెచ్చరించారు. గురువారం మండలంలో ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక మఠం వద్ద వున్న ఏజేఎస్ క్రషర్‌కు సంబంధించిన టిప్పర్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పజెప్పారు.

మాతమ్మ కొలుపు ఉత్సవం



కేవీబీపురం,మే16: మండలంలోని పాతపాళెం అరుంధతీ వాడలో మాతమ్మ అమ్మవారి కొలుపు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు తమ ఇంటి ముందుకే వచ్చిన మాతమ్మ అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

డెంగ్యూపై అవగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ, మే 16: డెంగ్యూ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ దివాకర్ సూచించారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం మండల కేంద్రంలోని పురవీధులలో గురువారం ర్యాలీ నిర్వహించారు. గాజులపెళ్కూరులో డెంగ్యూపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తిప్పలు



కొత్తూరులో పనిచేయని చేతి బోరు

కేవీబీపురం,మే16: కొత్తూరు, పెరిందేశం, బ్రాహ్మణపల్లి, ఆదవరం తదితర గ్రామాల్లో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేతి బోర్లు, మోటార్లు, పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో అవస్థలు పడుతూ రైతు బోర్లను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి చేతి బోర్లు బాగు చేయించినా తమ కష్టాలు కొంత తీరుతాయని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

దేవాంగ సంఘం రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

వరదయ్యపాళెం, మే 16: వరదయ్యపాళెంలో గురువారం దేవాంగ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవీప్రకాష్ దంపతులను రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పన తిలక్‌బాబు ఆధ్వర్యంలో సత్కరించారు. దేవాంగ సంక్షేమానికి అయన చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం రాష్ట్ర దేవాంగ సంఘం అభివృద్ధి,సంక్షేమం గురించి చర్చించారు. బొప్పన మోహనమురళి, బొప్పన చంద్రబాబు, కల్లూరు మోహన్, పీవీ రమేష్, గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అరవింద కంటి ఆస్పత్రి సేవలు భేష్

తిరుపతి(ఆటోనగర్), మే 16: ఎస్వీ అరవింద కంటి ఆస్పత్రి సేవలు భేష్ అని రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం కొనియాడారు. స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న రాస్ మహిళా పొదుపు సంఘాల సౌకర్యార్థం సేవానిలయంలో గురువారం ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 250మంది మహిళలకు కంటి పరీక్షలు చేసి, 50మందిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రఫుల్ల గాయత్రి రోగులకు పలు సూచనలు చేశారు. డైరెక్టర్ వి.నాగరాజు, వాసుదేవరెడ్డి, నాగేశ్వర్, వాణి, భార్గవి, వనజ, కరుణాకర్, బాలాజీ, సత్యనారాయణ, రామానుజులు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

రుయా నేత్ర నిధికి కళ్లు దానం



మృతుడి కళ్లను దానం చేస్తున్నట్లు కుటుంబ సభ్యులు అందజేస్తున్న అంగీకార పత్రం

తిరుపతి(వైద్యం), మే 16: గుండె పోటుకు గురైన వ్యక్తి రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించడంతో.. మృతుడి కళ్లను ఆయన కుటుంబ సభ్యులు రుయాస్పత్రిలోని నేత్ర నిధికి దానం చేశారు. స్థానిక బైరాగిపట్టెడకు చెందిన సీ.వీ.వెంకట్రమణ(64) గుండెపోటుతో రుయాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈవిషయం తెలుసుకున్న నేత్ర నిధి విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను కలిసి నేత్రదానం గురించి అవగాహన కల్పించారు. మృతుడి కుమారుడు యశ్వంత్‌కుమార్ తన తండ్రి కళ్లను దానం చేసేందుకు అంగీకరించడంతో వెంటనే కళ్లను సేకరించి రుయాస్పత్రిలోని నేత్ర నిధిలో భద్రపరిచారు. తీరని దుఖంలోనూ తన తండ్రి కళ్లను దానం చేసేందుకు ముందుకు వచ్చిన వారిని సూపరింటెండెంట్ రవిప్రభు అభినందించారు. నేత్ర నిధి టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్స్ సిద్ధం

తిరుపతి రూరల్, మే 16: జేఈఈ-2కే24 ఫలితాల్లో మంచిర్యాంకులు, అర్హత సాధించిన విద్యార్థులకు 2023కి సంబంధించిన సీట్ అలాట్‌మెంట్ కౌన్సెలింగ్ బుక్‌లెట్స్‌ని సిద్ధంచేసినట్లు ఐఐటీ-జేఈఈ/నీట్ ఫోరం కన్వీనర్ లలిత్‌కుమార్ పేర్కొన్నారు. ఆరు రౌండ్లుగా సాగే జేఈఈ కౌన్సెలింగ్‌లో గతేడాదిలో వచ్చిన ర్యాంకులు, సీట్లు, రిజర్వేషన్, బ్రాంచ్‌ల వివరాలను పొందుపరిచామని తెలిపారు. అలాగే ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్ల కేటాయింపు, ఓపెనింగ్, క్లోజింగ్ ర్యాంకుల వివరాలు పొందుపరిచినట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు డిజిటల్ బుక్‌లెట్స్‌ని వాట్సప్ ద్వారా పొందవచ్చన్నారు. వివరాల కోసం 98490 16661కి వాట్సాప్ మెసేజ్ పంపాలని కోరారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సుబ్రహ్మణ్యం(పాత చిత్రం)

శ్రీకాళహస్తి, మే 16: శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్రహ్మణ్యం(28) అనే యువకుడు మృతి చెందాడు. రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు ఏర్పేడు మండలం పల్లంపేట దళితవాడకు చెందిన సుబ్రహ్మణ్యం శ్రీకాళహస్తిలో ఆర్టీసీ ప్రైవేటు హయర్ బస్సుకు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. గురువారం విధులు ముగించుకుని శ్రీకాళహస్తి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ముచ్చివోలు వద్ద పాలవ్యాను, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా సుబ్రహ్మణ్యం మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా మార్చ్యురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అజయ్‌కుమార్ తెలిపారు.

బాలుడి మృతి



ప్రసాద్ మృతదేహం

శ్రీకాళహస్తి, మే 16: విరేచనాలతో ప్రసాద్ అనే నాలుగేళ్ల బాలుడు మృతి చెందాడు. తొట్టంబేడు మండలం విరుపాక్షిపురం గ్రామానికి చెందిన వెంకటేష్ కూలి పనులతో జీవనం సాగిస్తుంటాడు. అతని కుమారుడు ప్రసాద్(4) బుధవారం ఎండలో ఆడుకుంటూ అస్వస్థతకు గురయ్యాడు. అప్పటి నుంచి విరేచనాలతో బాలుని ఆరోగ్యం క్షీణించింది. గురువారం తల్లిదండ్రులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాలుడు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడికి తీవ్రగాయాలు



గాయపడిన మునెప్ప

శ్రీకాళహస్తి, మే 16: రోడ్డు ప్రమాదంలో మునెప్ప(37) అనే దివ్యాంగుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం వద్ద చెన్నై రహదారిపై చోటు చేసుకుంది. తంగేళ్లపాళెం గ్రామానికి చెందిన మునెప్ప దివ్యాంగుడు. ఇంటి సమీపంలో రోడ్డుపై నడచి వెళుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొంది. గాయపడిన మునెప్పను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

అభివృద్ధికి దూరాన రాజులపాళెం గిరిజనకాలనీ



రాజులపాళెం గిరిజనకాలనీ ఇదీ

ఏర్పేడు, మే 16: ఏర్పేడు మండలం రాజులపాళెం గిరిజన కాలనీవాసులు అభివృద్ధికి ఆమడదూరంలో నివసిస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లయినా రెక్కాడితేకానీ డొక్కాడని వీరి బతుకుల్లో ఏమార్పూ లేదు. గిరిజనకాలనీలో సుమారు 120 కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్నారు. కాలనీకి వెళ్లే రోడ్డుకు అడ్డంగా పెద్దకాలువ ఉంది. వర్షాకాలం వస్తే కాలనీవాసులు కాలువను దాటి వెళ్లాలి. దీనివల్ల వర్షాకాలంలో నానా అవస్థలు పడుతున్నారు. పాలకులకు, అధికారులకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో 14 వీధులున్నాయి. ఒక్క వీధిలో కూడా సీసీరోడ్డు నిర్మించలేదు. మురుగుకాలువలు లేవు. ఇళ్లల్లో వాడుకున్న నీరు బయటకు పంపడానికి ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయం లేక వీధుల్లోనే మురుగునీరు వదలిపెడుతున్నారు. ఫలితంగా రోగాలు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయిన నెలరోజులకే ఎక్కడ కూడా గుడిసె అనేది కనిపించకుండా చేస్తామని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో హామీ ఇచ్చారు. ఆ హామీ రాజులపాళెం గిరిజనకాలనీకి వర్తించలేదు. పూరిగుడిసెల్లోనే నివసిస్తున్నారు. పూరి గుడిసెలన్నీ రాజులపాళెం చెరువు కింద ఉంటున్నాయి. వర్షాకాలంలో చెరువులో నీరు పెరిగితే కాలనీ మునిగిపోయే ప్రమాదముంది. అధికారులు స్పందించి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రాజులపాళెం గిరిజనకాలనీకి వెళ్లే రోడ్డుమార్గం

సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ నివారిద్దాం: డీఎంహెచ్‌వో



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీహరి

తిరుపతి(వైద్యం), మే 16: ప్రతీ ఒక్కరూ దోమలు నిల్వ చేరకుండా తగిన జాగ్రత్తలు పాటించినప్పుడే సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ వ్యాధిని నివారించగలమని డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ఆయన వైద్యాధికారులతో కలిసి గురువారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి డెంగ్యూపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దోమల నుంచి వచ్చే ప్రమాదకరమైన వ్యాధుల్లో డెంగ్యూ, మలేరియా వంటివి ప్రధానమైనవని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమలు కుట్టకుండా దోమతెరలు వాడటం, నీరు నిల్వ చేరకుండా జాగ్రత్తలు పాటించడంతో దోమలను నిర్మూలించి, వ్యాధుల బారి నుంచి రక్షణ పొందవచ్చన్నారు. అనంతరం డెంగ్యూ వ్యాధి, దాని నివారణ మార్గాలపై నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండండి

నారాయణవనం, మే 16: డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దర్శిత్ రాజ్ తెలిపారు. గురువారం మండలంలోని నారాయణవనం, నైనారు కండ్రిగలో జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శిత్ రాజ్ మాట్లాడుతూ నీరు నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యులు రాగసుధా, హెల్త్ ఎడ్యుకేటర్ రామచంద్రయ్య, సూపర్‌వైజర్ వరలక్ష్మి, తిరుమలయ్య, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

శాస్త్రోక్తంగా చిన్నకొట్టాయి ఉత్సవం



స్వామి అమ్మవార్లకు అభిషేకం చేస్తున్న వేదపండితులు

శ్రీకాళహస్తి, మే 16: శ్రీకాళహస్తీశ్వరాలయంలో చిన్నకొట్టాయి ఉత్సవం గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను మేళతాళాలు,మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా పగడ చెట్టు వద్దకు తీసుకువచ్చారు. అక్కడ స్వామి అమ్మవార్లకు పాలు, పెరుగు, తేనె, గంధం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. రమణీయంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



రమేష్‌చంద్ర ప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఆదిమూలం

సత్యవేడు, మే 16: జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు రమేష్‌చంద్ర ప్రసాద్‌ను గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించారు. ఇటీవల రమేష్‌చంద్ర ప్రసాద్ గుండెపోటుకు గురై చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. నింద్ర మండలం ఓరూరుపేటలోని రమేష్ చంద్రప్రసాద్ గృహానికి ఆదిమూలం వెళ్లి పరామర్శించారు.

తాగునీటి కోసం వచ్చి బావిలో పడిన దుప్పి

● బయటకు తీసి అడవిలో వదిలిన అటవీ సిబ్బంది



బావిలో నుంచి దుప్పిని బయటకు తీస్తున్న అటవీ సిబ్బంది

చంద్రగిరి, మే 16: మండలంలోని నారావారిపల్లె సమీపంలో శేషాచలం అడవిలో నుంచి గురువారం తెల్లవారు జామున ఒక దుప్పి తాగునీటి కోసం వచ్చి వ్యవసాయి బావిలో పడింది. ఉదయం గ్రామస్తుల సమాచారంతో భాకరాపేట అటవీ సిబ్బంది వ్యవసాయి బావిలో దిగి తాళ్లు కట్టి అతికష్టం మీద దానిని బయటకు తీశారు. దుప్పికి చికిత్స చేసి, అడవిలో వదిలిపెట్టారు. దుప్పిని రక్షించిన వారిలో ప్రొటెక్షన్ వాచర్స్ హేమచంద్ర, కేశవులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న ఏనుగు సంచారం

చీకటి పడితే బయటికి రావాలంటే భయపడుతున్న ప్రజలు

పాకాల, మే 16: మండలంలో గత నాలుగు రోజులుగా ఏనుగు సంచారం ప్రజలను కలవరపెడుతోంది. సోమవారం పాకాల మండలం మణిపిరెడ్డిపల్లె వద్ద రైల్వే ట్రాక్ దాటి పాకాల పెద్దచెరువు వైపు వెళ్లింది. కుందేటిపల్లె, అడుసుపల్లె పరిసరాల్లో సంచరించినట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం బావిరాగన్న చెరువు, చొప్పావాని చెరువు, శ్రీరామాపురం, చలమకోన పరిసరాల్లో ఉన్నట్లు, అడవి నుంచి బయటికి రాలేదని అటవీ అధికారులు చెబుతున్నారు. గురువారం డీఎఫ్‌వో సతీష్, ఎఫ్ఆర్‌వో మాధవి, సిబ్బంది డ్రోన్ కెమెరాలతో వెతికినా ఆచూకీ లభించలేదు. ఎటువైపు వెళ్లిందో తెలియక చీకటి పడితే బయటికి రావడానికి ప్రజలు భయపడుతున్నారు. చొప్పావాని చెరువు సమీపంలో ఏనుగు పాదముద్రలు గుర్తించడంతో ఆ ప్రాంతంలో రెండు రోజులుగా వెతుకుతున్నారు. మండలంలో ఇప్పటికే పదిపుట్లబైలు, దామలచెరువు, ఈపాలగుట్టపల్లె, పేరసానిపల్లె పరిసరాల్లో ఏనుగుల దాడులతో రైతులు పంటలు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు ఒంటరి ఏనుగు సంచారంతో మరింత ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు ఏనుగును బంధించి, అభయారణ్యాలకు తరలించి రక్షించాలని కోరుతున్నారు.

బయో వ్యర్థాలకు మరోసారి నిప్పు

● భారీగా చెలరేగిన మంటలు ● సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తంతో తప్పిన ముప్పు



మంటల్లో కాలి బూడిదైన బయో వ్యర్థాలు

తిరుపతి(వైద్యం), మే 16: రుయాస్పత్రి ఆవరణలో ఇప్పటికే రెండుసార్లు అగ్నిప్రమాదం సంభవించిన బయో వ్యర్థాల నిల్వ చేసే ప్రదేశంలో గురువారం మరోసారి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆస్పత్రి ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా బయో వ్యర్థాలను, సాధారణ చెత్తాచెదారాన్ని కలిసి నిల్వ చేస్తున్నారు. నెల రోజుల కిందట గుర్తు తెలియని వ్యక్తులు వీటికి నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున చెలరేగిన మంటలను వెంటనే అగ్నిమాపక అధికారులు వచ్చి అదుపు చేశారు. ఇది జరిగిన వారం రోజుల వ్యవధిలోనే మరోసారి అదేవిధంగా జరిగింది. ఇక్కడ బయో వ్యర్థాలను వేయడంతోపాటు సిబ్బందే వాటికి నిప్పు పెట్టి కాలుస్తున్నారని, దీనిపై రుయా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టకపోతే ఇది మళ్లీ పునరావృతం అవుతుందని రోగులు హెచ్చరించారు. దీంతో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మానాయక్ బుధవారం భారీ ఎత్తున నిల్వ చేసివున్న బయో వ్యర్థాలను పరిశీలించి వెంటనే తొలగించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు. కానీ మరుసటి రోజునే ఆ బయో వ్యర్థాలకు నిప్పంటుకొని కాలి బూడిదవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఉద్దేశపూర్వకంగానే కొందరు సిబ్బంది బయో వ్యర్థాలకు నిప్పు పెట్టి కాల్చారని అధికారులు చెబుతున్నారు.

ఫలపుష్ప శోభితం పరిణయోత్సవ మండపం

● మొదటిసారిగా కేరళ సంప్రదాయ అలంకరణ 'తెప్పకోలం'



తిరుమల, మే 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో శుక్రవారం నుంచి పద్మావతి పరిణయోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా పరిణయోత్సవ మండపాన్ని వివిధ రుచుల ఫలాలు, సువాసనలు వెదజల్లే రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. గతంలో పసుపు- కుంకుమ మండపం, గాజుల మండపం, రంగురాళ్ల మండపం, అష్టలక్ష్మీ మండపం, దశవతార మండపం వంటి నమూనాలతో భక్తులను ఆకట్టుకునేలా టీటీడీ ఉద్యానవన శాఖ అలంకరణలు చేపట్టింది. ఈఏడాది మొట్టమొదటిసారిగా కేరళ సంప్రదాయ 'తెప్పకోలం' అనే అలంకరణతోపాటు ఫలపుష్పాలతో, విద్యుద్దీపాలతో భక్తులను ఆకట్టుకునేలా మండపాన్ని తీర్చిద్దుతున్నారు. ఇందులో రోజా, లిల్లీ, చామంతి వంటి రెండు టన్నుల సంప్రదాయ పుష్పాలు, 50వేల కట్‌ఫ్లవర్స్(15 రకాలు), వివిధ రకాల ఫలాలు, ఏనుగులు, గుర్రాలు, చిన్నకృష్ణుడు వంటి సెట్టింగులతో సుందరంగా అలంకరిస్తున్నారు. మండపం పైభాగంలో ఏర్పాటు చేసిన వెన్న ఉట్లు, వెండి గంటలు, పూల గుత్తులు ఆకట్టుకోనున్నాయి. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పర్యవేక్షణలో బెంగళూరుకు చెందిన 150 మంది నిపుణులైన సిబ్బందితోపాటు టీటీడీ గార్డెన్ విభాగానికి చెందిన మరో 50 మంది సిబ్బంది పద్మావతి పరిణయోత్సవ మండపాన్ని అలంకరిస్తున్నారు. మండపం అలంకరణను పుణెకు చెందిన శ్రీవేంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు విరాళంతో టీటీడీ చేస్తోంది.